www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్
23 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 227

# విశాల భారతి

తెలుగు దినపత్రిక




## ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా హైదరాబాద్

- కేంబ్రిడ్జి ప్రతినిధులతో సీఎం రేవంత్ కీలక భేటీ
- విద్యా పరిశోధన రంగంపై ప్రత్యేక దృష్టి
- యువ పరిశోధకులు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం
- సంయుక్త విద్యా కార్యక్రమాలపై చర్చ
- తెలంగాణ రైజింగ్ 2047కు అనుగుణంగా ప్రణాళిక

02

హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చే లక్ష్యం

## గచ్చిబౌలిలో కూలిన ఏడంతస్తుల భవనం



- శిథిలాల కింద చిక్కుకుని ఇద్దరు కార్మికుల మృతి
- 50 గజాల స్థలంలో భారీ నిర్మాణం
- నాలా ఆక్రమణపై హైడ్రా ఆగ్రహం
- నాలుగు నెలల క్రితమే యజమానికి నోటీసులు
- బిల్డర్ సాజిద్‌పై కేసు.. కొనసాగుతున్న గాలింపు
- అక్రమ నిర్మాణాలపై హైడ్రా వార్నింగ్

02

## మరోసారి జరిమానాను ఎదుర్కొన్న మెస్సీ

- మయామి-ఫిలడెల్ఫియా మ్యాచ్‌లో హైవోల్టేజ్ డ్రామా
- ప్రత్యర్థి జట్టు ప్లేయర్‌తో మైదానంలో ఘర్షణ పడినందుకు ఫైన్

02



# మరో వైఎస్ అనుకుంటే?

## రేవంత్ దూకుడుకు అధికారంలో బ్రేక్

- కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాల ప్రభావం
- సీనియర్ల అసమ్మతి పెరుగుతున్న వేళ
- హైకమాండ్ నియంత్రణతో పరిమితులు
- సొంత గూటి విమర్శలతో ఒత్తిడి
- నాయకత్వ పట్టు బలోపేతం కీలకం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి చూపిన రాజకీయ దూకుడు తెలంగాణ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో కీలకంగా నిలిచింది. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రత్యర్థులపై దూకుడుగా విరుచుకుపడిన ఆయన, అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం అదే స్థాయి పట్టు చూపలేకపోయారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. వైఎస్ రాజశేఖరరెడ్డి తరహాలో సీనియర్లను సమన్వయం చేస్తూ పార్టీపై సంపూర్ణ ఆధిపత్యం సాధిస్తారని ప్రారంభంలో అంచనాలు వచ్చాయి. అయితే కాంగ్రెస్‌లో సహజంగా ఉండే వర్గ రాజకీయాలు రేవంత్ పాలనలో మరింత స్పష్టంగా బయటపడ్డాయి. ముఖ్యమంత్రి పదవి ఉన్నప్పటికీ నిర్ణయం వెనుక పార్టీ సమీకరణాలు, సీనియర్ నేతల అభిప్రాయాలు, అధిష్ఠానం ఆలోచనలు ప్రభావం చూపుతున్న పరిస్థితి కనిపిస్తోంది. దీంతో రేవంత్ వ్యక్తిగత నాయకత్వ బలం గతంలో కనిపించినంత ప్రభావవంతంగా లేదన్న చర్చ మొదలైంది. అధికార పీఠం దక్కిన తరువాత

మిగతా 3లో..



## దానం నాగేందర్‌కు షాక్ తప్పదా?

- దానం నాగేందర్‌పై తీర్పు రిజర్వ్
- స్పీకర్ నిర్ణయంపై హైకోర్టు విచారణ
- ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక ఉత్కంఠ
- మరో 8 మంది ఎమ్మెల్యేలపై ప్రత్యేక విచారణ
- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలో ఆసక్తి
- ఫిరాయింపుల రాజకీయాలపై ప్రభావం

03



## అనుమతుల్లేవు.. డీజేపై ఉక్కుపాదం!

- పనామా ఎక్స్ రోడ్‌లో అనుమతుల్లేని డీజే సౌండ్‌పై స్థానికుల ఫిర్యాదు
- వారాహి షాప్ ప్రారంభోత్సవంతో ట్రాఫిక్‌కు అంతరాయం.. బస్‌స్టాప్ వద్ద ప్రయాణికుల అవస్థలు

08



## పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ సంకల్పం

- కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి
- ఇందిరమ్మ ఇల్లు, డబుల్ బెడ్ రూమ్‌ల పరిశీలన : లబ్దిదారులతో ముఖాముఖి భేటీ
- హైదరాబాద్ తరహాలో నిజామాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి స్థల పరిశీలన
- అట్టహాసంగా లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ

07

## తోడు నీడ లేదు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోండి

- ఓ నిరుపేద మహిళ కన్నీటి గాథ
- పాసి పనులు చేసుకొని ఇద్దరు పిల్లలను పోషిస్తున్న
- అద్దెలు కట్టలేక బతుకు భారంగా మారింది
- కష్టాల సాగరంలో ఓ నిరుపేద మహిళ

07



## రేవంత్‌కి కుర్చీ భయం

- రేవంత్‌పై రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు
- ఆగస్టు సెంటిమెంట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు
- అమెరికా పర్యటన రద్దుపై కొత్త ఆరోపణలు
- కాంగ్రెస్‌లో 20–30 మంది ఎమ్మెల్యేల భేటీ?
- ఇంటెలిజెన్స్ రిపోర్టుపై ఎంపీ కీలక వ్యాఖ్యలు
- రేవంత్ కుర్చీపై రాజకీయ చర్చ

03



## పవర్ ఉన్నా ఫలితం లేదా?

- మీనాక్షి నటరాజన్‌పై పెరుగుతున్న విమర్శలు
- క్రమశిక్షణ చర్యల్లో జాప్యం
- తెలంగాణ కాంగ్రెస్‌లో వర్గపోరు
- కొండా సురేఖ వివాదం మరో పరీక్ష
- అధిష్ఠానం వైఖరిపై చర్చ
- రేవంత్ సర్కారుకు పెరుగుతున్న ఇబ్బందులు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా మీనాక్షి నటరాజన్ బాధ్యతలు చేపట్టిన వేళ పార్టీకి కొత్త దిశ వస్తుందని నేతలు ఆశించారు. రాహుల్ గాంధీకి సన్నిహితురాలిగా, అవినీతి మచ్చలేని కఠిన నాయకురాలిగా ఉన్న గుర్తింపు రాష్ట్రంలో క్రమశిక్షణకు బలం చేకూరుస్తుందని భావించారు. గీత దాటే నాయకులపై వెంటనే చర్యలు తీసుకుంటారని, వర్గపోరును అదుపు చేస్తారని కార్యకర్తలు నమ్మారు. అయితే తెలంగాణ కాంగ్రెస్‌లో కొనసాగుతున్న సొంత ఎజెండాలు, ముఠా రాజకీయాలు ఆమె వ్యూహాలకు సవాల్‌గా మారాయి. పదవి చేపట్టిన తరువాత కఠిన నిర్ణయాల కంటే బుజ్జగింపు ధోరణికే ప్రాధాన్యం పెరిగిందన్న

మిగతా 4లో..

## పాలకులను నిలదీసే పత్రికా స్వేచ్ఛ ఉండాలి




- పాలకులను ప్రశ్నించే స్వేచ్ఛ అవసరం
- విమర్శలను స్వీకరించే ధైర్యం ఉండాలి
- జర్నలిజానికి విశ్వసనీయతే ప్రధాన ఆస్తి
- జిల్లా రిపోర్టర్ల రక్షణకు ప్రాధాన్యం
- స్వేచ్ఛతో పాటు బాధ్యత అవసరం
- ఫెడరేషన్ బలమైన వేదికగా ఎదగాలి

02

## కవిత రీబ్రాండింగ్

కుటుంబ నీడ నుంచి స్వతంత్ర రాజకీయ అస్తిత్వం వైపు కవిత

- పార్టీ సస్పెన్షన్ తర్వాత కొత్త రాజకీయ ప్రయాణం
- 'కవితక్క' నుంచి కొత్త ప్రజా గుర్తింపు కోసం ప్రయత్నం
- సామాజిక న్యాయం కేంద్రంగా భూలక్ష్మి అజెండా
- బీసీ రిజర్వేషన్లపై ఉద్యమ కార్యాచరణ
- కొత్త పార్టీ విజయంపై ఆసక్తికర రాజకీయ ప్రయోగం

03



## 22ఏ పేరుతో భూముల కబ్జా?

- 1,500 కుటుంబాలపై నిషేధిత జాబితా ప్రభావం
- బోడుప్పల్ కాలనీల్లో ఆందోళన
- 30 శాతం కమీషన్ ఆరోపణలపై ప్రశ్నలు
- 22ఏ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్
- బాధితుల కోసం పోరాటం చేస్తామని హెచ్చరిక

22ఏ బాధితులకు హరీశ్ రావు భరోసా



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములను కబ్జా చేసే హక్కు ఎవరు ఇచ్చారని బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్ రావు ప్రశ్నించారు. బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన 22ఏ బాధితులు ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. వందలాది మంది బాధితులు తమ గోడును వివరించడం గుండెను కలిచివేసిందని హరీశ్ రావు తెలిపారు. సర్వే నంబర్ 215, 215 పార్ట్‌ల లో మూడు దశాబ్దాలుగా ఎలాంటి వివాదాలు లేకుండా దాదాపు 1,500 కుటుంబాలు నివసిస్తున్నాయని చెప్పారు. అలాంటి ఇళ్లను అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద

మిగతా 2లో..

# గచ్చిబౌలిలో కూలిన ఏడంతస్తుల భవనం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్ గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో ప్లంబింగ్ పనులు చేస్తున్న ఇద్దరు కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని మృతి చెందారు. ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. భారీ శిథిలాలను తొలగిస్తూ ముమ్మరంగా గాలింపు చేపట్టారు. కొద్దిసేపటి తరువాత ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన ఉమేశ్ కారె, మోపత్‌గా పోలీసులు గుర్తించారు. వీరు కొండాపూర్‌లో నివసిస్తూ నిర్మాణ పనులు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 50 గజాల స్థలంలో ఏడంతస్తులు నిర్మించడంతో స్థానికులు గతంలోనే ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఘటనతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఘటన అనంతరం ప్రాంతంలో రాకపోకలను నియంత్రించి ప్రజలను దూరంగా ఉంచారు సహాయక బృందాలు అప్రమత్తంగా పనిచేశాయి తక్షణమే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కూలిన భవనం శిథిలాలు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై పడటంతో ఇద్దరు వృద్ధులు గాయపడ్డారు. అపార్ట్‌మెంట్ గోడలు దెబ్బతిన్నాయి. సమీప హాస్టల్‌లో ఉన్న విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారు. ప్రమాదం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో జరిగినట్లు స్థానికులు తెలిపారు. పెద్ద శబ్దం వినిపించడంతో బయటకు వచ్చి చూడగా భవనం నేలమట్టమై కనిపించిందని చెప్పారు. శిథిలాల తొలగింపు సమయంలో ప్రమాదకరంగా వేలాడుతున్న స్లాబ్ మరింత ముప్పు కలిగించే పరిస్థితి కనిపించింది. ఎన్డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది జాగ్రత్తగా శిథిలాలను తొలగించారు. ఘటనాస్థలాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, సీఎంసీ కమిషనర్ సృజన పరిశీలించారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సాయంత్రం వేళ ప్రమాదం జరిగి ఉంటే ప్రాణనష్టం మరింత ఎక్కువగా ఉండేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు ప్రాంతాన్ని అదుపులోకి తీసుకున్నారు. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భవన నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలా పక్కన కేవలం 50 గజాల స్థలంలో ఏడంతస్తుల నిర్మాణం చేపట్టారని, సెట్‌బ్యాక్‌లు లేకుండా అంతస్తులు పెంచారని చెబుతున్నారు. భవనం పైన పెంట్‌హౌస్ నిర్మాణ పనులు కూడా సాగుతున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. అంజయ్యనగర్‌లో ఇలాంటి నిర్మాణాలు చాలానే ఉన్నాయని, వాటిలో అనేక భవనాలకు అవసరమైన ఖాళీ స్థలం లేదని తెలిపారు. నాలా ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను గుర్తించి తొలగిస్తామని స్పష్టం చేశారు. హాస్టళ్లుగా వినియోగిస్తున్న భవనాల భద్రతను కూడా పరిశీలిస్తామని చెప్పారు. బిల్డర్ సాజిద్ నిర్మించిన ఇతర భవనాలపై కూడా తనిఖీలు చేపడతామని అధికారులు తెలిపారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని రంగనాథ్ వెల్లడించారు. యజమానులు వెంటనే భవనాలను ఖాళీ చేయాలని సూచించారు. దీంతో పరిసరాల్లో చర్చ మొదలైంది. భవనాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సీఎంసీ కమిషనర్ సృజన కీలక వివరాలు వెల్లడించారు. నాలుగు నెలల క్రితమే భవన యజమానికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. భవనాన్ని సీజ్ చేసినా ఇటీవల పనులు తిరిగి ప్రారంభించినట్లు గుర్తించామని చెప్పారు. అధికారిక చర్యలు పూర్తయ్యేలోపే నిర్మాణం కూలిపోయిందని వివరించారు. అనుమతులు, నిర్మాణ నాణ్యత, భద్రతా ప్రమాణాలపై పూర్తి స్థాయి పరిశీలన జరుగుతుందని తెలిపారు. మరోవైపు భవన యజమాని సాజిద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నట్లు సమాచారం. పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు. ప్రమాదానికి అసలు కారణాలను సాంకేతిక నిపుణుల సహకారంతో గుర్తించనున్నారు. నిర్మాణంలో నాణ్యతా లోపాలు ఉన్నాయా, అనుమతులకు మించి అంతస్తులు నిర్మించారా, నాలా పరిధిని ఆక్రమించారా వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అంజయ్యనగర్‌లో భవనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటించడంతో అక్రమ నిర్మాణాలపై చర్యలు వేగం పుంజుకునే అవకాశం కనిపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలను గుర్తించి కూల్చివేస్తామని ఆయన స్పష్టం చేశారు. నాలా ఆక్రమణలు, సెట్‌బ్యాక్‌ల ఉల్లంఘనలు, అనుమతులేని అంతస్తులు, భద్రతా ప్రమాణాల నిర్లక్ష్యంపై ప్రత్యేకంగా దృష్టి పెడతామని తెలిపారు. ఘటనలో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోవడంతో నిర్మాణ రంగంలో భద్రతా ప్రమాణాల అమలుపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. చిన్న స్థలాల్లో భారీ అంతస్తుల నిర్మాణానికి అనుమతులు ఎలా వచ్చాయన్న అంశం కూడా చర్చకు వచ్చింది. ప్రమాదానికి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు తగిన సహాయం అందించాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నగరవ్యాప్తంగా ప్రమాదకర నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం శిథిలాల తొలగింపు పూర్తిచేసి, ప్రాంత భద్రతను అధికారులు పరిశీలిస్తున్నారు.

# ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా హైదరాబాద్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యానికి అనుగుణంగా నగరాన్ని అంతర్జాతీయ విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు కేంద్రంగా మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. లండన్ పర్యటనలో భాగంగా ఆయన ప్రఖ్యాత కేంబ్రిడ్జి యూనివర్సిటీని సందర్శించారు. కేంబ్రిడ్జి జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో విద్యావేత్తలతో కీలక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఉన్న విద్యా అవకాశాలు, పరిశోధన సామర్థ్యాలు, స్టార్టప్ రంగం అభివృద్ధి గురించి తెలంగాణ ప్రతినిధులు వివరించారు. ఈ భేటీలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు. ప్రపంచస్థాయి సంస్థల భాగస్వామ్యంతో హైదరాబాద్‌కు కొత్త గుర్తింపు తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సీఎం వివరించారు. ఈ భాగస్వామ్యంతో తెలంగాణ విద్యా రంగానికి అంతర్జాతీయ పరిధి మరింత విస్తరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేంబ్రిడ్జి ప్రతినిధులతో జరిగిన చర్చల్లో తెలంగాణ భవిష్యత్ విద్యా ప్రణాళికలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కేంబ్రిడ్జి జడ్జ్ బిజినెస్ స్కూల్ మార్కెటింగ్ చైర్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, ప్రొఫెసర్ వెంకట సిరీష్ గండికోటతో సీఎం రేవంత్ రెడ్డి విస్తృతంగా మాట్లాడారు. హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి విద్యా సంస్థలకు అనుకూల వాతావరణం ఉందని వివరించారు. ప్రతిభావంతులైన యువతకు ఆధునిక విద్య, పరిశోధన అవకాశాలు అందితే నగరం అంతర్జాతీయ స్థాయిలో మరింత బలపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పెట్టుబడుల ప్రోత్సాహక కార్యక్రమాలు, పరిశ్రమల విస్తరణ, సాంకేతిక అభివృద్ధి గురించి ప్రతినిధులు వివరించారు. తెలంగాణతో కలిసి పనిచేసేందుకు కేంబ్రిడ్జి వర్గాలు ఆసక్తి చూపినట్లు సమావేశం అనంతరం సమాచారం వెలువడింది. భవిష్యత్ భాగస్వామ్యాల కోసం కార్యాచరణ ప్రణాళికపై కూడా చర్చ జరిగింది. విద్యా రంగంలో కొత్త అవకాశాలు సృష్టించడమే ప్రధాన ఉద్దేశంగా ఈ సమావేశం సాగింది. ఇలాంటి భాగస్వామ్యాలు రాష్ట్ర యువతకు విశ్వవ్యాప్త అవకాశాలను చేరువ చేయనున్నాయి. యువ పరిశోధకులు, పారిశ్రామికవేత్తలకు హైదరాబాద్‌ను మరింత అనుకూల కేంద్రంగా మార్చేందుకు ఇంక్యుబేషన్ సెంటర్లకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. కొత్త ఆలోచనలకు ఆర్థిక సహాయం, సాంకేతిక మార్గదర్శకత్వం, పరిశ్రమల అనుసంధానం కల్పించడం ద్వారా స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయాలని భావిస్తోంది. కేంబ్రిడ్జి వంటి ప్రముఖ విద్యాసంస్థల అనుభవం తెలంగాణ యువతకు ఉపయోగపడేలా భాగస్వామ్య కార్యక్రమాలను రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. హైదరాబాద్‌లో సంయుక్త విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, ఆధునిక సాంకేతికత ఆధారిత పరిశోధన ప్రాజెక్టులు చేపట్టడం వంటి అంశాలు చర్చకు వచ్చాయి. పరిశోధన ఫలితాలను పరిశ్రమలకు అనుసంధానం చేస్తే కొత్త ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులను హైదరాబాద్‌కు ఆకర్షించే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. విద్య, పరిశోధన, ఆవిష్కరణల కలయికతో నగర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునివ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది హైదరాబాద్‌ను జాతీయ స్థాయిలో కూడా ప్రత్యేకంగా నిలబెట్టే కీలక ప్రయత్నంగా మారుతోంది. తెలంగాణ రైజింగ్ 2047లో భాగంగా హైదరాబాద్‌కు గ్లోబల్ నాలెడ్జ్ హబ్ హోదా తీసుకురావడమే ప్రభుత్వ దీర్ఘకాలిక లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ఇప్పటికే ఐటీ, పరిశ్రమలు, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో హైదరాబాద్‌కు ఉన్న బలాన్ని విద్యా పరిశోధన రంగాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పెట్టుబడిదారులు ఒకే వేదికపై కలిసేలా అనుకూల వాతావరణం కల్పించాలన్నది ప్రభుత్వ ఆలోచన. కేంబ్రిడ్జి భాగస్వామ్యం ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణా కార్యక్రమాలు, పరిశోధనా సహకారం, స్టార్టప్ మార్గదర్శకత్వం అందే అవకాశం ఉంది. యువతలోని ప్రతిభను ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేయడానికి ఈ కార్యక్రమాలు దోహదపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్ బ్రాండ్‌ను మరింత విస్తరించేందుకు విదేశీ పర్యటనల్లో సీఎం పెట్టుబడులతో పాటు విద్యా భాగస్వామ్యాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ఈ ప్రయత్నాలు నగర భవిష్యత్ అభివృద్ధికి కీలకంగా మారే అవకాశముంది. దీంతో విద్యా రంగంలో పెట్టుబడులు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంబ్రిడ్జి యూనివర్సిటీతో చర్చలు తెలంగాణ విద్యా రంగంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలకు కొత్త దారులు తెరవగలవని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి పరిశోధనా వాతావరణం ఏర్పడితే దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, పరిశోధకులు నగరాన్ని ఎంచుకునే అవకాశాలు పెరుగుతాయి. స్టార్టప్ సంస్థలకు అకడమిక్ మద్దతు లభిస్తే ఆవిష్కరణలు వేగంగా మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉంటుంది. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యా కార్యక్రమాలు రూపొందించడం ద్వారా నైపుణ్యాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుంది. తెలంగాణ ప్రభుత్వం విదేశీ పర్యటనలను పెట్టుబడుల సమీకరణతో పాటు జ్ఞాన భాగస్వామ్యాల విస్తరణకు ఉపయోగిస్తోంది. కేంబ్రిడ్జి వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతో సంబంధాలు బలోపేతం అయితే హైదరాబాద్‌కు అంతర్జాతీయ విద్యా పటంలో మరింత ప్రాధాన్యం లభించవచ్చు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాల్లో భాగంగా తీసుకుంటున్న ఈ చర్యలు యువతకు కొత్త అవకాశాలు, పరిశోధకులకు వేదికలు, పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించే దిశగా సాగుతున్నాయి. ఫలితంగా హైదరాబాద్ గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే అవకాశాలు బలపడుతున్నాయి.



# పాలకులను నిలదీసే పత్రికా స్వేచ్ఛ ఉండాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ప్రజాస్వామ్యం బలంగా నిలవాలంటే పాలకులను ప్రశ్నించే స్వేచ్ఛ పత్రికలకు ఉండాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వాలు విమర్శలను స్వీకరించే ధైర్యం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రెస్ క్లబ్‌లు కలిసి హైదరాబాద్‌లో ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శనివారం ప్రారంభోత్సవంలో భారతీయ జర్నలిజం వారసత్వం, నేటి సవాళ్లపై ఆయన ప్రసంగించారు. సమాజంలోని వివక్షను ప్రశ్నించడం పత్రికల బాధ్యతగా పేర్కొన్నారు. జరిగిన ఘటనలను వార్తలుగా చెప్పడమే కాకుండా వాటి వెనుక ఉన్న అంతరార్థాన్ని పరిశీలించి ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉందన్నారు. హల్ద్వానీలో మల్లికార్జున ఖర్గే సభ అనంతరం జరిగిన శుద్ధీకరణ కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ సమానత్వం, గౌరవంపై ప్రశ్నలు లేవనెత్తారు. అంబేద్కర్ చూపిన మార్గంలో దేశం ఇంకా ప్రయాణించాల్సి ఉందని తెలిపారు. ప్రజలకు నిజమైన సమాచారం సకాలంలో ప్రజలకు చేరాలంటే నిర్భయమైన మీడియా అవసరమని, ప్రజాస్వామ్యానికి కీలక రక్షణ కవచమని ఆయన వివరించారు. భారతదేశ నిర్మాణంలో జర్నలిజం కీలక పాత్ర పోషించిందని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. వార్తలు అందించడం మాత్రమే కాకుండా పౌరులను చైతన్యవంతులను చేయడం జర్నలిజం ప్రధాన లక్ష్యమన్నారు. మహాత్మా గాంధీ యంగ్ ఇండియా, నవజీవన్, హరిజన్ పత్రికల ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రజలను సమీకరించారని చెప్పారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మూక్ నాయక్, బహిష్కృత భారత్ పత్రికలతో అణగారిన వర్గాలకు గొంతుకనిచ్చారని వివరించారు. లోకమాన్య తిలక్ కేసరి, మరాఠా పత్రికలతో వలస పాలనను సవాలు చేశారని తెలిపారు. దాదాభాయ్ నౌరోజీ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి నేతలు పత్రికలను సామాజిక రాజకీయ సంస్కరణలకు సాధనాలుగా మలిచారని కొనియాడారు. అమృత బజార్ పత్రిక, ది హిందూ ప్రజల స్వరంగా నిలిచాయని పేర్కొన్నారు. విమర్శను శత్రుత్వంగా చూడకుండా ప్రజా ప్రయోజనానికి ఉపయోగపడే సూచనగా స్వీకరించాలని ప్రభుత్వాలకు సూచించారు. జర్నలిస్టులు ఆధారాలతో పనిచేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. ఇదే ప్రజాస్వామ్య ఆరోగ్యానికి అవసరమని అన్నారు. ప్రజాస్వామ్యంలో పాలకులు పత్రికలతో ఎలా వ్యవహరించాలో చెప్పేందుకు నెహ్రూ, కార్టూనిస్ట్ శంకర్ ఘటనను భట్టి గుర్తుచేశారు. శంకర్స్ వీక్లీలో తనపై నిరంతరం కార్టూన్లు వచ్చినా నెహ్రూ నన్ను కూడా విడిచిపెట్టవద్దు, శంకర్ అని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. సంపాదకుడి పదవికి ఒకప్పుడు దేశంలో అత్యంత గౌరవం ఉండేదని తెలిపారు. రామ్‌నాథ్ గోయెంకా వంటి యజమానులు ప్రభుత్వాలను ప్రశ్నించే ధైర్యం చూపారని గుర్తుచేశారు. వార్తా సంస్థలు వాణిజ్య ప్రయోజనాలకే పరిమితం కాకుండా విశ్వసనీయతను కాపాడుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాలు భావప్రకటనా స్వేచ్ఛను విస్తరించినా బాధ్యతను మరవకూడదన్నారు. ఒకరి ప్రతిష్ఠను దెబ్బతీయడం స్వేచ్ఛ కాదని స్పష్టం చేశారు. కృత్రిమ మేధ, వాయిస్ క్లోనింగ్ కాలంలో జర్నలిస్టులకు నమ్మకమే ప్రధాన ఆస్తి అని చెప్పారు. పత్రికలు స్వతంత్రంగా పనిచేసినప్పుడే అధికార వ్యవస్థపై సమర్థవంతమైన పర్యవేక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. ప్రజల తరఫున నిలిచే మీడియా వ్యవస్థకు నైతిక బలం, వాస్తవ నిర్ధారణ, స్వతంత్ర ఆలోచన అత్యవసరమని వివరించారు. కొత్తగా ఏర్పాటైన ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ జర్నలిస్టుల భద్రత, వృత్తి ప్రమాణాలు, సంక్షేమానికి బలమైన వేదికగా ఎదగాలని భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. ముఖ్యంగా జిల్లా, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే రిపోర్టర్ల సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోయినా, ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోయినా, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కాకపోయినా ప్రభుత్వానికి ముందుగా సమాచారం అందించేది స్థానిక జర్నలిస్టులేనన్నారు. ప్రభుత్వం వినడానికి సిద్ధంగా ఉంటే మంచి జర్నలిస్టు అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థగా పనిచేస్తారని పేర్కొన్నారు. జర్నలిజాన్ని రక్షించాలంటే జర్నలిస్టుల భద్రత, గౌరవం, ఉద్యోగ పరిస్థితులు, సంక్షేమాన్ని కూడా రక్షించాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంలో వారి పాత్రను ప్రశంసించారు. జిల్లా రిపోర్టర్లకు సహాయం, శిక్షణ, రక్షణ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారి సమస్యలను చర్చకు తీసుకురావాలని ఫెడరేషన్‌ను కోరారు. స్థానిక వాస్తవాలు వెలుగులోకి రావడానికి వారి సేవలు ఎంతో విలువైనవని తెలిపారు. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడంతో పాటు జర్నలిస్టులు తమ వృత్తి ప్రమాణాలకు కూడా జవాబుదారీగా ఉండాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. మమ్మల్ని జవాబుదారీగా ఉంచండి, మిమ్మల్ని మీరు మీ ప్రమాణాలకు జవాబుదారీగా ఉంచుకోండి అని సూచించారు. రెండు బాధ్యతల ప్రయోజనం పౌరుడికే దక్కాలని అన్నారు. తెలంగాణ ప్రజల స్వభావంలో స్వేచ్ఛగా అభిప్రాయాలను వ్యక్తం చేసే ధోరణి ఉందని చెప్పారు. తమతో విభేదించే గొంతుకలను వినే ధైర్యం అధికారంలో ఉండేవారికి ఉండాలని స్పష్టం చేశారు. ఫెడరేషన్ మరో సంస్థగా కాకుండా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాలు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు బలమైన వేదికగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ రామ్, కే శ్రీనివాసరెడ్డి, సంగీత బారోచ్, అనంతనాథ్, గౌతమ్ లాహిరి, విజయ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పత్రికా స్వేచ్ఛకు బాధ్యత జత కావాలని, విశ్వసనీయత కోల్పోతే మీడియా ప్రభావం తగ్గిపోతుందని హెచ్చరించారు. విలువలను కాపాడే బాధ్యతలో జర్నలిస్టులు కీలకులని పేర్కొన్నారు.




## దివ్యాంగుల యూడీఐడీ ప్రత్యేక క్యాంపు తేదీలో మార్పు

**విశాలభారతి, మెదక్ :** దివ్యాంగుల కోసం నిర్వహించనున్న యూడీఐడీ (UDID) ప్రత్యేక శిబిరం తేదీలో మార్పు చేసినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు. గతంలో ఆగస్టు 26న శిబిరం నిర్వహించనున్నట్లు ప్రకటించగా, మిలాద్ ఉన్ నబి సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉండటంతో శిబిరాన్ని ఆగస్టు 25కు మార్చినట్లు పేర్కొన్నారు. మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఆగస్టు 25న యూడీఐడీ ప్రత్యేక క్యాంపు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నూతన చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువు ఆగస్టు 31తో ముగియనున్న నేపథ్యంలో ఇప్పటివరకు యూడీఐడీ ధృవీకరణ పత్రం పొందని దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. యూడీఐడీ కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన వారు ముందుగా మీసేవ కేంద్రంలో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. అర్హులైన వారికి స్లాట్ బుకింగ్ అనంతరం ఆగస్టు 25న మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించే ప్రత్యేక శిబిరంలో వైద్య పరీక్షలు చేపట్టనున్నట్లు వివరించారు. యూడీఐడీ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి క్యాంపు నిర్వహణకు సంబంధించిన సమాచారం డీఆర్డీఏ కార్యాలయం, సంబంధిత మండల ఏపీఎంల ద్వారా తెలియజేయనున్నట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు ప్రత్యేక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# 22ఏ పేరుతో భూముల కబ్జా?

**మొదటిపేజీ తరువాయి**

22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం దుర్మార్గమని విమర్శించారు. ఈ నిర్ణయం వల్ల ప్రజలు తమ ఆస్తులపై హక్కులు ఉన్నా భయంతో జీవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబాలకు స్పష్టత ఇవ్వాలని కూడా సూచించారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇంటిని అమ్మేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లిన వేళ ఆస్తి నిషేధిత జాబితాలో ఉందని తెలియడంతో కాలనీ వాసులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని హరీశ్ రావు వివరించారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ పూర్తైన ఇళ్లను ఇప్పుడు వివాదాస్పద ఆస్తులుగా చూపడం ప్రజలపై అన్యాయమైన ఒత్తిడికి దారితీస్తోందని ఆరోపించారు. కృత్రిమ వివాదాలు సృష్టించి కొందరు మధ్యవర్తుల ద్వారా భారీ కమీషన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా వినిపిస్తున్నాయని చెప్పారు. దశాబ్దాలుగా ప్రశాంతంగా జీవిస్తున్న కుటుంబాలకు ఒక్కసారిగా 22ఏ భయం చూపించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. బినామీలతో సెటిల్మెంట్లు చేయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధితులు చెబుతున్నారని తెలిపారు. ప్రజల ఆస్తులపై అనిశ్చితి పెంచడం సరికాదని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం పారదర్శకమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. సకాలంలో ప్రజలకు న్యాయసహాయం అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. 30 శాతం కమీషన్ సర్కార్ అని ప్రజలు అంటున్నారని హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. చట్టబద్ధమైన ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చి యజమానులను ఇబ్బందులకు గురిచేయడం వెనుక లాభాపేక్ష ఉందనే అనుమానాలు బలపడుతున్నాయని అన్నారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బోడుప్పల్ కాలనీల సమస్య ఒక్క ప్రాంతానికి పరిమితమైనది కాదని, రాష్ట్రంలోని ప్రాంతాల్లో ఇలాంటి బాధితులు ఉన్నారని పేర్కొన్నారు. రికార్డుల్లో తప్పులు ఉంటే వాటిని పరిశీలించి సరిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ప్రజల జీవితకాల పొదుపులతో నిర్మించుకున్న ఇళ్లపై హక్కులు ప్రశ్నార్థకంగా మారడం ఆందోళనకరమన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలను తెలుసుకోవాలని కోరారు. సంబంధిత దస్తావేజులను పరిశీలించి న్యాయబద్ధమైన పరిష్కారం ఇవ్వాలని సూచించారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి కాలపరిమితితో చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ స్పందన ఆలస్యమైతే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రజల విశ్వాసం నిలబెట్టేందుకు పారదర్శకత అవసరమని స్పష్టం చేశారు. బోడుప్పల్ వాసులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 22ఏ బాధితులు అధైర్యపడవద్దని హరీశ్ రావు భరోసా ఇచ్చారు. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని తెలిపారు. అవసరమైతే ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమా నగర్ కాలనీలకు సంబంధించిన భూముల రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలోకి ఎలా వచ్చాయనే అంశాన్ని స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. తప్పుగా చేర్చిన ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించి యజమానులకు స్వేచ్ఛగా లావాదేవీలు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. రిజిస్ట్రేషన్లపై ఉన్న అడ్డంకులు తొలగించకపోతే బాధితుల ఇబ్బందులు మరింత పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజలకు పూర్తి సమాచారం ఇవ్వాలని సూచించారు. న్యాయపరమైన హక్కులను పరిరక్షించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రజల భూముల విషయంలో ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని హరీశ్ రావు అన్నారు. నిషేధిత జాబితాలో ఆస్తులను చేర్చే ముందు సంబంధిత యజమానులకు సమాచారం ఇవ్వాలని, ఆధారాలను పరిశీలించాలని కోరారు. సంవత్సరాలుగా ఎలాంటి వివాదం లేకుండా ఉన్న ఇళ్లను ఒక్కసారిగా నిషేధిత ఆస్తులుగా మార్చడం వల్ల కుటుంబాల ఆర్థిక ప్రణాళికలు దెబ్బతింటున్నాయని చెప్పారు. బ్యాంకు రుణాలు, విక్రయాలు, వారసత్వ బదలాయింపులు వంటి వ్యవహారాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక అధికారులను నియమించి త్వరితగతిన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.



## మరోసారి జరిమానాను ఎదుర్కొన్న మెస్సీ

**స్పోర్ట్స్ డెస్క్:** మేజర్ లీగ్ సాకర్ టోర్నీలో ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సీకి బిగ్ షాక్ తగిలింది. ఫిలడెల్ఫియా యూనియన్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా ప్రత్యర్థి ఆటగాడు క్విన్ సుల్లివన్‌తో మైదానంలో వాగ్వాదానికి దిగినందుకు మెస్సీకి భారీ జరిమానా విధించారు. అయితే జరిమానా మొత్తాన్ని మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. ఫిలడెల్ఫియా ఆటగాడు క్విన్ సుల్లివన్ తో మెస్సీ తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఈ గొడవలో ఆగ్రహానికి గురైన మెస్సీ.. సుల్లివన్ మెడ వెనుక, తలపై చేయి చేసుకున్నారు. అయితే ప్రత్యక్షంగా ఈ ఘటనను చూడని రిఫరీ ఆ సమయంలో లియోనెల్ మెస్సీకి ఎలాంటి కార్డు చూపించలేదు. అదనపు సమయంలో స్టేడియంలో మెస్సీ, సుల్లివన్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో మెస్సీ సుల్లివన్ మెడ వెనుక తన చేతిని పెట్టాడు. ఈ సంఘటనకు రిఫరీ ఎటువంటి కార్డు చూపనప్పటికీ.. వీడియో ఫుటేజీని సమీక్షించిన తర్వాత, ప్రత్యర్థి ముఖం, తల లేదా మెడను తాకకూడదనే కఠినమైన నియమాన్ని మెస్సీ ఉల్లంఘించాడని అధికారులు కనుగొన్నారు. ఈ నియమం ప్రకారం మెస్సీకి జరిమానా విధించడం ఇది రెండోసారి. ఫిబ్రవరి 2025లో న్యూయార్క్ సిటీ ఎఫ్‌సీతో జరిగిన మ్యాచ్ సందర్భంగా ఇదే నియమం కింద మెస్సీకి గతంలో జరిమానా విధించారు. అదే మ్యాచ్ చివరి క్షణాల్లో మైదానంలో వాతావరణం బాగా వేడెక్కింది. బంతితో పెనాల్టీ బాక్స్ వైపు పరుగెడుతున్న సుల్లివన్‌ను, మయామికి చెందిన ఇయాన్ ఫ్రే టాకిల్ చేసి మెడ పట్టుకున్నాడు, దీనికి ఫ్రేకు కూడా జరిమానా విధించారు. మైదానం బయట ఉరు జట్ల ఆటగాళ్ల మధ్య జరిగిన గొడవకు గాను మయామికి చెందిన యానిక్ బ్రైట్, ఫిలడెల్ఫియాకు చెందిన కావన్ సుల్లివన్‌లకు రిఫరీ రెడ్ కార్డ్ చూపించి మైదానం నుంచి పంపేశారు. అయితే ఫిలడెల్ఫియా అప్పీల్ తర్వాత విచారణ బృందం ఏకగ్రీవంగా కావన్ సుల్లివన్ రెడ్ కార్డ్, ఒక మ్యాచ్ నిషేధాన్ని రద్దు చేసి అతడిని తదుపరి మ్యాచ్ ఆడేందుకు అనుమతించింది. మయామి ఆటగాళ్లు లియోనెల్ మెస్సీ, ఇయాన్ ఫ్రే లీగ్ విచారణలో సస్పెన్షన్(నిషేధం) నుంచి తప్పించుకున్నారు. కేవలం జరిమానాతో బయటపడటంతో ఇద్దరూ తదుపరి మ్యాచ్ లు ఆడేందుకు అర్హత సాధించారు. అలాగే ఫిలడెల్ఫియా జట్టు చేసిన అప్పీల్‌ను స్వీకరించిన మేజర్ సాకర్ లీగ్ రివ్యూ టీమ్, కావన్ సుల్లివన్ కు ఇచ్చిన రెడ్ కార్డును రద్దు చేస్తూ తదుపరి మ్యాచ్ ఆడేందుకు అనుమతిచ్చింది. అట్లాంటా యునైటెడ్‌తో జరిగిన ఆటలో ఫౌల్ జరిగినట్లు నటించినందుకు మిన్నెసోటా యునైటెడ్ డిఫెండర్ ఆంటోని మార్కానిక్‌కు కూడా లీగ్ జరిమానా విధించింది.

# కవిత రీబ్రాండింగ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో కుటుంబ రాజకీయాల ప్రభావం మారుతున్న దృశ్యానికి కవిత తాజా అడుగులు ఉదాహరణగా నిలుస్తున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబ వలయంలో సాగిన ఆమె రాజకీయ ప్రయాణం, పార్టీ సస్పెన్షన్ తర్వాత కొత్త దిశను ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. గులాబీ పార్టీ నాయకత్వంపై విమర్శలు, కొత్త రాజకీయ వేదిక ఏర్పాటుతో ఆమె స్వతంత్ర అస్తిత్వాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటివరకు తండ్రి, సోదరుడి రాజకీయ పరిచయాలతో కనిపించిన కవిత, ఇప్పుడు తనకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంపై దృష్టి పెట్టినట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. ఈ మార్పు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు కారణమవుతోంది. కుటుంబ ఆధారిత గుర్తింపును దాటి, సొంత రాజకీయ శక్తిని నిర్మించుకోవాలనే ఆలోచన ఆమె అడుగుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే కవిత ప్రయాణం ఇప్పుడు వ్యక్తిగత నిర్ణయంగా కాకుండా, ప్రత్యేక రాజకీయ ప్రయోగంగా మారుతోంది. ఇదే మార్పు ఆమె భవిష్యత్ రాజకీయ బలానికి పరీక్షగా నిలవనుంది. కీలక పరీక్ష. లిక్కర్ కేసు అనంతరం పార్టీలో తన ప్రాధాన్యం తగ్గిందనే భావన కవితలో బలపడినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఆగస్టు పదిహేనున ఇచ్చిన టీవీ ఇంటర్వ్యూలో కేటీఆర్ తనను మూవ్ ఆన్ అయ్యా నని చెప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ, సస్పెన్షన్ కారణంగానే తాను ముందుకు వెళ్లాల్సి వచ్చిందని ఆమె వ్యాఖ్యానించారు. ఈ మాటల్లో కుటుంబ ఆధారిత రాజకీయ గుర్తింపును దాటి సొంత బాట ఎంచుకోవాలనే సంకేతం కనిపిస్తోంది. పార్టీ నుంచి బయటకు వచ్చిన తర్వాత విమర్శలకే పరిమితం కాకుండా, ప్రజా సమస్యలను కేంద్రంగా చేసుకుని తన రాజకీయ ప్రయాణాన్ని నిర్మించుకోవాలని ఆమె ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇది వ్యక్తిగత అసంతృప్తి కంటే స్వీయ రాజకీయ స్థాపనకు దారితీస్తున్న పరిణామంగా కనిపిస్తోంది. తండ్రి నీడ నుంచి బయటకు వచ్చి, తన నిర్ణయాలు తానే తీసుకునే నాయకురాలిగా ఎదగాలనే లక్ష్యం ఇందులో కనిపిస్తోంది. ఈ మార్గంలో కుటుంబ మద్దతు లేకపోవడం ఆమెకు పెద్ద సవాలుగా మారే అవకాశముంది. ఇప్పటివరకు కవితక్కగా పరిచయమైన నాయకురాలు, తెలంగాణ ప్రజల సమస్యలపై గళమెత్తే విభిన్న గుర్తింపును నిర్మించుకోవాలని చూస్తున్నట్లు తాజా పరిణామాలు చెబుతున్నాయి. తెలంగాణ ఉద్యమ అనుభవం, తెలంగాణ జాగృతి నేపథ్యాన్ని ఉపయోగించుకుని ప్రజలతో కొత్త భావోద్వేగ అనుబంధం ఏర్పరచుకోవడం ఆమె వ్యూహంగా కనిపిస్తోంది. కుటుంబ పేరు కంటే ప్రజా సమస్యలతో తనను అనుసంధానించుకోవాలనే ప్రయత్నం ఇందులో కనిపిస్తుంది. కల్వకుంట్ల ఇంటిపేరును పక్కనపెట్టి దేవనపల్లి పేరుతో రాజకీయ ప్రొజెక్షన్ చేయాలనే చర్చలు కూడా ఈ నేపథ్యంలో ప్రాధాన్యం పొందాయి. అయితే ఈ మార్పు అధికారికంగా ఏ రూపం దాల్చుతుందనేది ఇంకా స్పష్టతకు రావాల్సి ఉంది. ప్రజా సమస్యలపై పోరాడే నాయకురాలిగా కొత్త ముద్ర వేయడం ద్వారా కుటుంబ రాజకీయ ముద్రను తగ్గించుకోవాలనే ప్రయత్నం కూడా ఇందులో కనిపిస్తోంది. ఈ ప్రయత్నానికి నిరంతర ప్రజా సంబంధాలు అవసరం. క్షేత్రస్థాయిలో సామాజిక న్యాయాన్ని ప్రధాన అజెండాగా తీసుకెళ్లేందుకు కవిత ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. ఆగస్టు పద్దెనిమిదిన ప్రకటించిన భూలక్ష్మి పథకంలో భూమిలేని పేద కుటుంబాలకు ఎకరం భూమి ఇవ్వాలనే ప్రతిపాదనను ఆమె ముందుకు తెచ్చారు. బీసీలకు శాసనసభల్లో యాభై శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ కూడా చేశారు. కేంద్రం స్పందించకపోతే చలో ఢిల్లీ ఉద్యమం చేపడతామని ప్రకటించడం ద్వారా ఉద్యమ రాజకీయ శైలిని కొనసాగించాలనే సంకేతం ఇచ్చారు. మహిళలు, అట్టడుగు వర్గాలు, విద్య, వైద్యం వంటి అంశాలను ముందుకు తెస్తూ రాష్ట్రవ్యాప్తంగా సభలు నిర్వహించడం ద్వారా ప్రత్యేక ఓటు వర్గాన్ని నిర్మించుకోవాలనే లక్ష్యం కనిపిస్తోంది. సంకల్ప సభలు, ప్రజా సమావేశాలు, ప్రత్యక్ష విమర్శలతో క్షేత్రస్థాయిలో తన రాజకీయ పునాదిని బలోపేతం చేయాలని ఆమె భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యాచరణకు ప్రజల స్పందన పెరిగితే ఆమె రాజకీయ బలం క్రమంగా విస్తరించే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలిక కృషి అవసరం. అదే ఆమెకు పరీక్షగా నిలుస్తుంది. తండ్రి స్థాపించిన ప్రాంతీయ పార్టీ బలంగా ఉన్న సమయంలోనే బయటకు వచ్చి సొంత పార్టీతో పెద్ద రాజకీయ స్థాయిని సాధించడం భారత రాజకీయాల్లో అరుదైన ప్రయోగంగా నిలవొచ్చు. ఇందిరాగాంధీ, జయలలిత వంటి మహిళా నేతలు తమ రాజకీయ శక్తిని ప్రత్యేకంగా నిర్మించుకున్నా, కుటుంబం నుంచి వచ్చిన ప్రాంతీయ పార్టీని వీడి కొత్త పార్టీతో పెద్ద విజయం సాధించిన ఉదాహరణలు పరిమితమే. మమతా బెనర్జీ మాత్రం పాత పార్టీని విడిచి కొత్త రాజకీయ వేదికను నిర్మించి జాతీయ స్థాయికి ఎదిగారు. కవిత ముందున్న సవాళ్లు మాత్రం తీవ్రమైనవే. కేడర్ నిర్మాణం, నిధుల సమీకరణ, మూడు ప్రధాన రాజకీయ శక్తులతో పోటీ, ప్రజా విశ్వాసం సాధించడం కీలకం. అందుకే ఆమె ప్రయోగం ఎంతవరకు ఫలిస్తుందో కాలమే నిర్ణయించాలి. ప్రస్తుతం కనిపిస్తున్న సంకేతాలు మాత్రం కుటుంబ నీడ నుంచి స్వతంత్ర రాజకీయ అస్తిత్వం వైపు ఆమె అడుగులు వేస్తున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. భవిష్యత్తు ఫలితం స్పష్టమవుతుంది.



# మరో వైఎస్ అనుకుంటే?

**మొదటిపేజీ తరువాయి**

పార్టీని పూర్తిగా తన రాజకీయ శైలికి అనుగుణంగా మార్చడంలో ఆయనకు ఎదురవుతున్న సవాళ్లు ఇప్పుడు చర్చగా మారాయి. కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం, గ్రూపు రాజకీయాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. రేవంత్ పాలనలో అవి మరింత బహిరంగంగా కనిపిస్తున్నాయి. మంత్రి కొండా సురేఖ, ఆమె కుటుంబ సభ్యుల నుంచి ప్రభుత్వంపై వచ్చిన విమర్శలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. ఇలాంటి సందర్భాల్లో వెంటనే కఠిన చర్యలు తీసుకోకపోవడం ముఖ్యమంత్రి పలుకుబడిపై ప్రశ్నలు రేకెత్తించింది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి సీనియర్ నేతల అసంతృప్తి స్వరం కూడా పార్టీలో ఏకాభిప్రాయం లోపాన్ని బయటపెట్టింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడిస్తున్నప్పుడు ముఖ్యమంత్రి నాయకత్వంపై సహజంగానే రాజకీయ చర్చ పెరుగుతుంది. ఒకవైపు ప్రభుత్వాన్ని నడిపిస్తూ మరోవైపు పార్టీలోని విభిన్న వర్గాలను సంతృప్తిపరచాల్సిన పరిస్థితి రేవంత్ ముందుంది. అందరినీ ఒకే నాయకత్వం కింద సమీకరించి, నిర్ణయాల విషయంలో స్పష్టత చూపించగలిగితేనే పార్టీపై ఆయన పట్టు మరింత బలపడుతుంది. ప్రస్తుతం కూడా ఈ లక్ష్యం పూర్తిగా సాధ్యం కాలేదన్న రాజకీయ భావన ఉంది. రేవంత్ బలహీనతకు కారణం పూర్తిగా ఆయన నిర్ణయ సామర్థ్యంలోనే ఉందని చెప్పడం సరైంది కాదు. కాంగ్రెస్ అధిష్ఠానం మొదటి నుంచీ ఏ ఒక్క రాష్ట్ర నాయకుడికీ సంపూర్ణ ఆధిపత్యం ఇవ్వకుండా సమతుల్యతను కొనసాగించే విధానాన్ని అనుసరిస్తోంది. ముఖ్యమంత్రి పదవి రేవంత్‌కు దక్కినా, పార్టీ సంస్థాగత వ్యవహారాలు, మంత్రివర్గ కూర్పు, కీలక నిర్ణయాల్లో ఢిల్లీ నాయకత్వ ప్రభావం కొనసాగుతోంది. దీంతో రాష్ట్రంలో సొంత రాజకీయ ముద్ర వేయడంతో పాటు అధిష్ఠానంతో సమన్వయం చేయాల్సిన అవసరం ఉంది. ఢిల్లీ లాబీయింగ్, సీనియర్ నేతల సంబంధాలు, వర్గ సమీకరణాలు ప్రతి నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కనిపించిన స్వేచ్ఛతో అధికారంలో నిర్ణయాలు తీసుకోవడం కష్టమవుతుంది. హైకమాండ్ నియంత్రణను బలహీనతగా మాత్రమే చూడటం సరికాదు. అయితే రాష్ట్ర రాజకీయాల్లో తనకు అనుకూలమైన స్పష్టమైన వ్యవస్థను నిర్మించడంలో రేవంత్ మరింత చొరవ చూపాల్సిన అవసరం ఉంది. లేకపోతే ప్రతి వివాదం ఆయన నాయకత్వంపై సందేహాలకు కారణమవుతుంది. ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకుంటే అది సాధారణ రాజకీయ పోరాటంగానే చూస్తారు. కానీ సొంత పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు నాయకత్వాన్ని ప్రశ్నిస్తే పరిస్థితి భిన్నంగా ఉంటుంది. అలాంటి విమర్శలు ప్రభుత్వ విశ్వసనీయతను దెబ్బతీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కుటుంబ సభ్యుల వ్యవహారాలపై పార్టీ నేతల బహిరంగ వ్యాఖ్యలు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి స్పందనపై ఆసక్తి పెరుగుతుంది. అసమ్మతిని వెంటనే పరిష్కరించకుండా వదిలేస్తే క్రమంగా మరిన్ని స్వరాలు బయటకు వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో ప్రభుత్వంపై కంటే పార్టీ అంతర్గత వ్యవహారాలపైనే ప్రజల దృష్టి నిలుస్తుంది. రేవంత్‌కు ప్రస్తుతం ఎదురవుతున్న ప్రధాన సవాలు ఇదే. ప్రత్యర్థుల దాడిని ఎదుర్కోవడం కంటే సొంత గూటిలో సమన్వయం కోసం ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తే పరిపాలనపై దృష్టి తగ్గుతుంది. అందుకే నాయకత్వం స్పష్టత, క్రమశిక్షణ, సమన్వయం అత్యవసరంగా మారాయి. ఈ మూడు అంశాల్లో సమతుల్యత సాధిస్తే రాజకీయ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది. రేవంత్‌కు సరిదిద్దుకునే సమయం పరిమితంగా ఉంది. వైఎస్సార్ తరహా పూర్తి ఆధిపత్యం సాధించాలంటే ముందుగా పార్టీలోని వర్గాలను సమన్వయం చేయాలి. తరువాత క్షేత్రస్థాయిలో అసంతృప్తిని గుర్తించి, సంస్థాగత వ్యవస్థను పునర్నిర్మించాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా నాయకుల మధ్య నిరంతర సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాలి. వివాదాస్పద అంశాలపై ఆలస్యం లేకుండా స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలి. అదే సమయంలో అధిష్ఠానంతో సంబంధాలు దెబ్బతినకుండా రాష్ట్ర ప్రయోజనాలను గట్టిగా వినిపించాలి. నాయకత్వంపై విశ్వాసం పెరగాలంటే నిర్ణయాల్లో స్థిరత్వం, అమలులో వేగం, పార్టీ వ్యవహారాల్లో క్రమశిక్షణ కనిపించాలి. ఇవి సాధ్యమైతే రేవంత్ మరోసారి తన రాజకీయ దూకుడును మళ్లీ ప్రదర్శించే అవకాశం ఉంటుంది. లేనిపక్షంలో బయటి ప్రత్యర్థుల కంటే సొంత పార్టీలోని అసమ్మతి శక్తులే పెద్ద సవాలుగా మారవచ్చు. అందువల్ల రాబోయే కాలం రేవంత్‌కు కీలక పరీక్షగా నిలవనుంది. ఆయన ప్రతి నిర్ణయం పార్టీ భవిష్యత్తుతో పాటు ప్రభుత్వ స్థిరత్వాన్ని కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది.



# దానం నాగేందర్‌కు షాక్ తప్పదా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వివాదం కీలక దశకు చేరింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడుతుందా అనే ఉత్కంఠకు త్వరలో ముగింపు రానుంది. ఆయనకు సంబంధించిన పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌ల ధర్మాసనం శుక్రవారం విచారణ పూర్తి చేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తుది తీర్పును రిజర్వ్ చేసింది. అసెంబ్లీ స్పీకర్ గతంలో తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. తీర్పు వెలువడే సమయం దగ్గరపడటంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా మారే అవకాశం కనిపిస్తోంది. దానం భవితవ్యంపై వచ్చే నిర్ణయం భవిష్యత్ పరిణామాలకు దిశానిర్దేశం చేయవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చర్చకు కేంద్రబిందువుగా మారి, అన్ని వర్గాల దృష్టిని ఆకర్షిస్తున్న కీలక పరిణామంగా మరింత నిలిచింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి విజయం సాధించారు. తరువాత ఆయన అధికార కాంగ్రెస్‌లో చేరారు. అయితే పార్టీ మారినట్లు స్పీకర్ గుర్తించలేదు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వేర్వేరు రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు కె. వివేక్ రెడ్డి, గండ్ర మోహన్ రావు కీలక వాదనలు వినిపించారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దానం స్వచ్ఛందంగా బీఆర్ఎస్ సభ్యత్వాన్ని వదిలినట్లుగా పరిగణించాల్సి ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ టికెట్‌పై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం, నామినేషన్ వేయడం, ప్రచారం నిర్వహించడం పార్టీ మార్పుకు స్పష్టమైన సంకేతాలని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అధికారిక రాజీనామా లేకపోయినా వాస్తవ ప్రవర్తనను పరిశీలించాల్సి ఉంటుందని వాదించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇదే అంశం కీలకంగా మారింది, సమీకరణాలపై ప్రభావం చూపొచ్చు. దానం కేసులో మరో ప్రత్యేక అంశం కూడా ఉంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ టికెట్‌పై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం ఆయన కేసును మిగతా ఫిరాయింపుల నుంచి భిన్నంగా నిలిపింది. ఇదే కారణంతో ధర్మాసనం దానం నాగేందర్‌కు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను ప్రత్యేకంగా పూర్తి చేసి తీర్పును రిజర్వ్ చేసింది. ఇదే సమయంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మరో ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై ఉన్న అనర్హత పిటిషన్లను వేరుగా విచారిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ జాబితాలో కాలే యాదయ్య, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కడియం శ్రీహరి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, టి. ప్రకాశ్ గౌడ్, అరెకపూడి గాంధీ, తెల్లం వెంకట్ రావు, సంజయ్ కుమార్ ఉన్నారు. దీంతో దానం కేసు తీర్పు తరువాతి విచారణలకు ప్రాధాన్య సూచికగా మారింది. తదుపరి ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. దీంతో కేసుపై ఉత్కంఠ పెరిగింది, పార్టీలు పరిణామాలను గమనిస్తున్నాయి. ఒకవేళ హైకోర్టు దానం నాగేందర్‌పై అనర్హత వేటుకు అనుకూలంగా తీర్పు ఇస్తే ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉపఎన్నిక అనివార్యమవుతుంది. దాంతో కాంగ్రెస్‌కు అక్కడ కొత్త అభ్యర్థిని సిద్ధం చేయాల్సిన పరిస్థితి రావచ్చు. బీఆర్ఎస్, బీజేపీలకు కూడా ఈ పరిణామం తమ బలాన్ని పరీక్షించుకునే అవకాశంగా మారుతుంది. ముఖ్యంగా మిగతా ఎనిమిది మంది ఎమ్మెల్యేల కేసులపై కూడా తీర్పు ప్రభావం పడే అవకాశం ఉంది. పార్టీ ఫిరాయింపులపై న్యాయస్థానం ఏ ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుంటుందన్నది భవిష్యత్ రాజకీయాలకు కీలకం కానుంది. మరోవైపు స్పీకర్ నిర్ణయాన్ని కోర్టు సమర్థిస్తే కాంగ్రెస్‌కు రాజకీయ ఊరట లభిస్తుంది. పార్టీ మార్పులపై జరుగుతున్న విమర్శలకు కొంత ఉపశమనం దక్కవచ్చు. దీంతో ఒకే తీర్పు రాష్ట్ర రాజకీయ సమీకరణాలపై విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక వస్తుందా లేదా అన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఇది అధికార, విపక్ష శిబిరాల్లో ఆసక్తిని పెంచుతోంది, వ్యూహాలపై చర్చ మొదలైంది. హైకోర్టు తీర్పు రిజర్వ్ కావడంతో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు తదుపరి పరిణామాల కోసం ఎదురుచూస్తున్నాయి. తీర్పు ఎప్పుడు వెలువడుతుందన్న దానిపై కూడా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. దానం నాగేందర్‌కు అనుకూల నిర్ణయం వస్తే స్పీకర్ అధికార పరిధిపై మరోసారి చర్చ మొదలయ్యే అవకాశం ఉంది. ప్రతికూల తీర్పు వస్తే పార్టీ ఫిరాయింపులపై రాష్ట్రంలో కొత్త రాజకీయ పోరాటానికి వేదిక సిద్ధమవుతుంది. మిగతా ఎమ్మెల్యేల కేసుల్లో కూడా ఇదే అంశాలు ప్రాధాన్యం పొందవచ్చు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ అమలుపై తెలంగాణలో కొత్త న్యాయ, రాజకీయ చర్చకు ఇది దారితీయవచ్చు. ప్రస్తుతం అందరి చూపు హైకోర్టు తీర్పుపైనే ఉంది. దానం కేసు ఫలితం ఖైరతాబాద్ రాజకీయాలకే పరిమితం కాకుండా, తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ మార్పుల భవిష్యత్‌పై కూడా ప్రభావం చూపే అవకాశముంది. అందుకే ఈ తీర్పును రాజకీయ వర్గాలు అత్యంత కీలకంగా చూస్తున్నాయి. తుది నిర్ణయం కోసం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు.



# రేవంత్‌కి కుర్చీ భయం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి విదేశాల్లో ఉన్న సమయంలో తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రోజుకో రకంగా మాట్లాడుతున్నారని, పంచాయితీలు తెరపైకి వస్తున్నాయని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి రాష్ట్రానికి దూరంగా ఉంటే తన కుర్చీ పరిస్థితి ఏంటోననే భయం వెంటాడుతోందని ఎద్దేవా చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆగస్టు నెలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని వ్యాఖ్యానించారు. ఈ నెలలో ముఖ్యమంత్రులు అమెరికా వెళ్తే తిరిగి వచ్చే సమయానికి పదవి ఉంటుందో లేదో చెప్పలేమని అన్నారు. ఎన్టీఆర్ హయాం నుంచి ఈ తరహా పరిస్థితులు మొదలయ్యాయని తెలిపారు. అప్పట్లో తెలుగుదేశం పార్టీలో జరిగిన పరిణామాలు ఇందుకు ఉదాహరణగా నిలిచాయని చెప్పారు. రేవంత్ రెడ్డి కూడా టీడీపీ నుంచి వచ్చిన నేత కావడంతో ఆ చరిత్ర పునరావృతమవుతోందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారితీశాయని చెప్పారు. రఘునందన్ రావు వ్యాఖ్యల ప్రకారం రేవంత్ రెడ్డికి రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై సమాచారం అందిందని తెలుస్తోంది. ముఖ్యమంత్రి మంత్రులుగా పనిచేసిన కొందరు నేతలు, పదవులు దక్కని మరికొందరు నాయకులు తన కుర్చీ కింద నీళ్లు తెస్తున్నారని ఆయన ఆరోపించారు. వీరంతా కలిసి సమావేశాలు నిర్వహిస్తున్నారనే సమాచారం ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా ముఖ్యమంత్రికి చేరి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. దీంతో అమెరికా పర్యటనపై రేవంత్ రెడ్డి పునరాలోచనకు వచ్చినట్టు పేర్కొన్నారు. అమెరికా పర్యటనను రద్దు చేసుకుని తిరిగి వచ్చే నిర్ణయం వెనుక రాష్ట్ర రాజకీయాలే కారణమై ఉండవచ్చని వ్యాఖ్యానించారు. అయితే ఈ ఆరోపణలపై అధికార కాంగ్రెస్ వర్గాల నుంచి స్పష్టమైన స్పందన వెలువడలేదు. ముఖ్యమంత్రి పర్యటన మార్పుకు ఇతర పరిపాలనా కారణాలు ఉన్నాయా అనే విషయం కూడా స్పష్టంగా తెలియాల్సి ఉంది. రాజకీయ ప్రత్యర్థి చేసిన వ్యాఖ్యలను వాస్తవాలుగా తీసుకోకుండా, సంబంధిత వర్గాల వివరణ కోసం వేచి చూడాల్సిన అవసరం ఉందని పరిశీలకులు చెబుతున్నారు. యూకే పర్యటనకు అనుమతి ఇచ్చిన వారు అమెరికా పర్యటనకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని రఘునందన్ రావు ప్రశ్నించారు. విదేశీ పర్యటనలపై సందేహాలు వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు భద్రతా అంశాలు, పరిపాలనా అవసరాలు, అధికారిక కార్యక్రమాల షెడ్యూల్ వంటి కారణాలు ఉండొచ్చని భావించవచ్చు. అయితే తనకు అందిన సమాచారం మేరకు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇరవై నుంచి ముప్పై మంది ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా సమావేశం నిర్వహిస్తున్నారని ఎంపీ ఆరోపించారు. ఈ సమావేశాల ఉద్దేశ్యం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత అసంతృప్తి ఉందనే ప్రచారం గతంలోనూ వినిపించింది. తాజాగా వచ్చిన ఆరోపణలు ఆ ప్రచారానికి మరింత బలం చేకూర్చే ప్రయత్నంగా కనిపిస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఎమ్మెల్యేల సంఖ్య, సమావేశం జరిగిన ప్రదేశం, పాల్గొన్న నాయకుల వివరాలపై స్వతంత్ర నిర్ధారణ లేదు. అందువల్ల ఈ ఆరోపణలను రాజకీయ విమర్శల కోణంలోనే చూడాల్సి ఉంటుంది. ఇది ప్రస్తుతం చర్చకు కారణమైంది. తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై అసంతృప్తి ఉందా అనే ప్రశ్నలు ఈ వ్యాఖ్యలతో మరోసారి తెరపైకి వచ్చాయి. పార్టీ నేతల మధ్య అభిప్రాయ భేదాలు కనిపించినప్పటికీ, అవి నాయకత్వ మార్పు వరకు వెళ్లే స్థాయిలో ఉన్నాయా అనేది స్పష్టంగా తెలియదు. రఘునందన్ రావు మాత్రం ప్రస్తుత పరిణామాలను తీవ్రంగా ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి అమెరికా పర్యటనను రాజకీయ పరిణామాలతో ముడిపెట్టారు. ఆగస్టు నెలలో ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలపై ఆయన చేసిన వ్యాఖ్యలు గత రాజకీయ సంక్షోభాలను గుర్తుచేసే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. ఎన్టీఆర్ కాలం నాటి పరిణామాలను ఉదాహరణగా తీసుకుని ఆయన వాదనను ముందుకు తెచ్చారు. అయితే చరిత్రలో జరిగిన పరిణామాలను ప్రస్తుత పరిస్థితులతో పోల్చడం ఎంతవరకు సమంజసం అనేది రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలపై బీజేపీ చేస్తున్న విమర్శలు రాజకీయ వ్యూహంలో భాగమని పార్టీ వర్గాలు భావించవచ్చు. ఈ పరిణామాలపై రాజకీయ ఆసక్తి కొనసాగుతోంది. మొత్తంగా రఘునందన్ రావు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు కారణమయ్యాయి. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దు వెనుక కాంగ్రెస్ ఎమ్మెల్యేల అసంతృప్తి ఉందనే ఆరోపణను ఆయన ప్రధానంగా ముందుకు తెచ్చారు. ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా సమావేశమయ్యారనే అంశాన్ని ప్రస్తావించారు. నేతలు కలిసి రాజకీయంగా కదులుతున్నారనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే ఈ ఆరోపణలకు ఆధారాలు ఏమిటనేది ఎంపీ వెల్లడించలేదు. కాంగ్రెస్ స్పందన వచ్చిన తరువాతే పూర్తి చిత్రం స్పష్టమవుతుంది. పర్యటన మార్పుకు పరిపాలనా కారణాలు ఉండే అవకాశాన్ని కొట్టిపారేయలేం. రాజకీయ ఆరోపణలు, అధికారిక సమాచారం మధ్య తేడాను గమనించడం అవసరం. రఘునందన్ రావు వ్యాఖ్యలు మాత్రం అధికార కాంగ్రెస్‌లో అంతర్గత పరిస్థితులపై మరోసారి చర్చకు తెరలేపాయి.



# ఎస్టీ సెల్ నూతన అధ్యక్షుడు భూక్య గోపా నాయక్‌కు సన్మానం

**శాలువా కప్పి సన్మానించిన కాంగ్రెస్ జిల్లా నాయకులు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి.**



**కురవి, విశాల భారతి:**

కురవి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా బంగారిగూడెం గ్రామపంచాయతీకి చెందిన యువ నాయకుడు భూక్యా గోపా నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం బంగారిగూడెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన అధ్యక్షుడు గోపా నాయక్‌కు కండువా కప్పి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గార్లపాటి భరద్వాజ్ రెడ్డి మాట్లాడుతూ డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ ఆదేశాలు, జిల్లా కాంగ్రెస్ పార్టీ పెద్దల సూచనల మేరకు గోపా నాయక్‌కు ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎస్టీలకు అన్ని రంగాల్లో అవకాశాలు, ప్రాధాన్యత కల్పిస్తున్నారని పేర్కొన్నారు. నాయకుడు గోపా నాయక్‌కు బాధ్యతలు అప్పగించడం ద్వారా కురవి మండలంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మరింత బలోపేతం అవుతుందని గార్లపాటి భరద్వాజ్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని ప్రతి గిరిజన తండాలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు.

**పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తా: గోపా నాయక్.**

నూతన అధ్యక్షుడు భూక్యా గోపా నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్‌కు, మరియు నాయకులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా కాంగ్రెస్ నాయకులు గార్లపాటి భరద్వాజ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కురవి మండలంలోని ప్రతి గిరిజన తండాకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమిస్తూ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వెంకట్ నారాయణ, విజయ్, రంజిత్, ఉపసర్పంచ్ తురక వెంకటేష్, మాచర్ల సందీప్, అబ్బగాని వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి

**ఆగస్టు 29న హైదరాబాద్‌లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలి**

**గూడూర్ విశాల భారతి:**



రాజకీయ ఖైదీలందరినీ వెంటనే విడుదల చేయాలని, ప్రజా ఉద్యమాలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర నాయకులు కామ్రేడ్ జోగ రణధీర్ పిలుపునిచ్చారు. శనివారం గూడూరు మండల కేంద్రంలోని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులు, జీవించే హక్కు, జీవనోపాధి హక్కుల కోసం దేశంలో దశాబ్దాలుగా ప్రజలు పోరాటాలు సాగిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా ఆదివాసీలు జల్, జంగల్, జమీన్, ఆత్మగౌరవం కోసం సాగిస్తున్న ఉద్యమాలపై ప్రభుత్వాలు నిర్బంధం, అణచివేతకు పాల్పడుతున్నాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో మావోయిస్టు ఉద్యమంతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో అనేక మంది జైళ్లలో విచారణ ఖైదీలుగా సంవత్సరాల తరబడి మగ్గుతున్నారని రణధీర్ పేర్కొన్నారు. మావోయిస్టు ఉద్యమం ముగిసిపోయిందని ప్రభుత్వాలు ప్రకటిస్తున్న నేపథ్యంలో, ఆ ఉద్యమానికి సహకరించారనే ఆరోపణలతో జైళ్లలో ఉన్న సాధారణ కార్యకర్తలు, ముఖ్యంగా ఆదివాసీలపై ఉన్న కేసులను సమీక్షించి, నిర్బంధంలో ఉన్న వారిని విడుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయడంతో పాటు జైళ్లలో నిర్బంధించిన ఆదివాసులపై కేసులను ఎత్తివేయాలని, ప్రజా సంఘాల నాయకులు, మేధావులపై నమోదు చేసిన అక్రమ ఉపా కేసులను ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 29న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, ప్రొఫెసర్ కోదండరామ్, ఎమ్మెల్సీ, కూనంనేని సాంబశివరావు, సీపీఐ కార్యదర్శి, ఎమ్మెల్యే, జాన్ వెస్లీ, సీపీఎం కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తదితరులు పాల్గొంటారని తెలిపారు.

# పవర్ ఉన్నా ఫలితం లేదా?

**మొదటిపేజీ తరువాయి**

విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో కొందరు నేతలు అధిష్టానం ఆదేశాలను పట్టించుకోవడం లేదన్న చర్చ బలపడింది. సమస్యలు మొదలైనప్పుడే పరిష్కరించకుండా ఆలస్యం చేయడం పరిస్థితిని సంక్లిష్టంగా మార్చింది. ఫలితంగా ఇన్‌ఛార్జ్ పదవికి ఉన్న రాజకీయ ప్రభావం తగ్గుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. పార్టీ శ్రేణులు ఆమె నుంచి గట్టి చర్యలను ఆశిస్తున్నాయి. ప్రభుత్వ ప్రతిష్టను కాపాడే బాధ్యత కూడా ఆమెపై ఉంది. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు బయటపడిన ప్రతిసారీ మీనాక్షి నటరాజన్ చర్చలు, కమిటీల ఏర్పాటు వైపు మొగ్గు చూపుతున్నారన్న అభిప్రాయం ఉంది. సమస్యకు మూల కారణం గుర్తించి తక్షణ చర్యలు తీసుకోకపోవడంతో అసమ్మతి స్వరాలు మరింత బలపడుతున్నాయి. క్రమశిక్షణ ఉల్లంఘించిన నేతలపై చర్యలు ఆలస్యమైతే పార్టీ నిర్ణయాలకు విలువ తగ్గుతుంది. ఇదే పరిస్థితి తెలంగాణ కాంగ్రెస్‌లో పలుమార్లు కనిపించిందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఒకవైపు పీసీసీ నాయకత్వం సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుంటే, మరోవైపు వర్గాల మధ్య విభేదాలు కొత్త రూపాల్లో బయటపడుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో ఇన్‌ఛార్జ్ నుంచి స్పష్టమైన రాజకీయ సంకేతాలు రావాలి. కానీ బుజ్జగింపులతో సమస్యలను తాత్కాలికంగా సర్దుబాటు చేయడం వల్ల అసంతృప్తి పూర్తిగా తొలగడం లేదు. నిర్ణయాలు ఆలస్యం కావడంతో ప్రతి



వర్గం తన బలాన్ని చూపించేందుకు ప్రయత్నిస్తోంది. దీంతో తెలంగాణలో ఆమె నిర్ణయ సామర్థ్యంపై చర్చ మొదలైంది. పార్టీ శ్రేణులు కూడా స్పష్టమైన వైఖరిని కోరుతున్నాయి. ఇదే కీలకం. మంత్రి కొండా సురేఖ చుట్టూ తాజాగా పెరిగిన వివాదం మీనాక్షి నటరాజన్ నాయకత్వానికి మరో పరీక్షగా మారింది. సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, ఆమె అనుచరుడు సుమంత్‌పై వినిపిస్తున్న ఆర్థిక సెటిల్‌మెంట్ ఆరోపణలు కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. ఈ అంశాలు ప్రభుత్వ ప్రతిష్టను ప్రభావితం చేస్తున్న సమయంలో అధిష్టానం నుంచి స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం పార్టీ వర్గాల్లో అసంతృప్తిని పెంచుతోంది. పీసీసీ స్థాయిలో నివేదికలు సిద్ధమవుతున్నాయన్న ప్రచారం ఉన్నప్పటికీ, తుది నిర్ణయంపై స్పష్టత కనిపించడం లేదు. గతంలోనే సురేఖ వ్యవహారశైలిపై గట్టి చర్యలు తీసుకుని ఉంటే తాజా పరిణామాలు ఇంత దూరం వచ్చేవి కావన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. వివాదం పెరిగిన తరువాత స్పందించడం కంటే మొదటి దశలోనే హెచ్చరికలు, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందని పలువురు భావిస్తున్నారు. మంత్రి స్థాయి నేతలపై నిర్ణయం సున్నితమైన విషయం. పార్టీ ప్రయోజనాల కోసం స్పష్టమైన రేఖ అవసరం. ప్రస్తుతం ఆ రేఖ కనిపించకపోవడంతో వివాదం పొడవుగా సాగుతోంది. మీనాక్షి నటరాజన్ తెలంగాణ బాధ్యతలు స్వీకరించినప్పుడు వర్గపోరును నియంత్రించే సమర్థత, క్రమశిక్షణను పునరుద్ధరించే ధైర్యం ఆమె ప్రధాన బలాలుగా భావించారు. కానీ ఆ అంచనాలకు తగ్గట్టుగా ఇప్పటివరకు నిర్ణయాత్మక చర్యలు కనిపించకపోవడం కాంగ్రెస్‌లో చర్చనీయాంశమైంది. ప్రతి వివాదాన్ని చర్చలతో ముగించాలన్న ప్రయత్నం పార్టీకి తాత్కాలిక ప్రశాంతత ఇవ్వవచ్చు. అయితే దీర్ఘకాలంలో అసమ్మతి నేతలకు మరింత స్వేచ్ఛ కల్పించే ప్రమాదం ఉంటుంది. నాయకత్వం ఒకసారి హెచ్చరించిన తరువాత కూడా అదే తప్పులు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవన్న నమ్మకం పార్టీ శ్రేణుల్లో ఏర్పడాలి. ఆ నమ్మకం బలపడకపోతే అధిష్టానం ప్రతిష్ట దెబ్బతింటుంది. కాంగ్రెస్‌కు క్రమశిక్షణ కీలకం. ప్రభుత్వ నిర్ణయాలపై విమర్శలు వస్తున్న సమయంలో సొంత నేతల వివాదాలు భారంగా మారుతున్నాయి. అందుకే ఇన్‌ఛార్జ్ నుంచి స్పష్టమైన మార్గదర్శకత్వం, బాధ్యత నిర్ధారణ అవసరం. వర్గాల మధ్య సమతుల్యతతో పాటు నిర్ణయాలను అమలు చేయించే సామర్థ్యం చూపాలి. ఇది ఇప్పుడు పార్టీకి అత్యవసరమైన అవసరంగా మారింది. మొత్తంగా చూస్తే తెలంగాణ కాంగ్రెస్‌లో మీనాక్షి నటరాజన్ ఎదుర్కొంటున్న సవాలు సాధారణ సంస్థాగత సమస్య కాదు. అందువల్ల ఇన్‌ఛార్జ్ పాత్ర కేవలం సమావేశాలు నిర్వహించడం, వర్గాలను సమన్వయం చేయడం వరకు పరిమితం కాకూడదు. అవసరమైన సందర్భంలో ఎవరు తప్పు చేసినా పార్టీ నియమాల ప్రకారం చర్య తీసుకునే ధైర్యం చూపాలి. కొండా సురేఖ వ్యవహారం ఇప్పుడు ఆ పరీక్షను మరింత స్పష్టంగా ముందుకు తెచ్చింది. ఆలస్యం జరిగే కొద్దీ వ్యక్తిగత విభేదాలు సంస్థాగత సంక్షోభాలుగా మారే ప్రమాదం పెరుగుతుంది. రేవంత్ ప్రభుత్వానికి రాజకీయ నష్టం కలిగించే అంశాలను పార్టీ స్థాయిలోనే నియంత్రించాలి. నేతల మధ్య సమన్వయం కోసం చర్చలు అవసరమే అయినప్పటికీ, నిర్ణయం తీసుకునే దశలో స్పష్టత తప్పనిసరి. ఇకపై మీనాక్షి నటరాజన్ తన రాజకీయ ప్రభావాన్ని కఠిన నిర్ణయాల ద్వారా చూపించగలరా అన్నదే ప్రధాన ప్రశ్నగా మారింది. కార్యకర్తల్లో నమ్మకం పెరగాలంటే నిర్ణయాలు చేతల్లో కనిపించాలి.

## యువత సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి




**దేవరుప్పుల విశాల భారతి :** మండలం మండల యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పులిగిల్ల వెంకన్న యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సమావేశంలో పార్టీ బలోపేతం, యువతను కాంగ్రెస్ పార్టీ వైపు మరింతగా ఆకర్షించడం, గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం తదితర అంశాలపై చర్చించారు. రాబోయే రోజుల్లో యువత సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు అందుబాటులో ఉంటూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆల్వల కార్తీక్, జిల్లా అధ్యక్షులు క్రాంతి, నియోజకవర్గ అధ్యక్షులు ధరావత్ రాజేష్, ఉపాధ్యక్షులు రాజేష్ యాదవ్, ఉప్పల ప్రకాష్, మండల యువజన నాయకులు బీసు హరికృష్ణ, యాకేష్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, టౌన్ అధ్యక్షులు మహేష్ యాదవ్, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అశోక్ యాదవ్, అఖిల్‌తో పాటు మండల యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళితుని పై దాడి



**మునుగోడు విశాల భారతి :** దళితుని వ్యవసాయ భూమిని అక్రమంగా కబ్జా చేస్తున్న మంగదొడ్లగూడెం భూస్వాములను పట్టేదారు కోడి రాములు ఆయన కుమారులు అడ్డుకోగా గ్రామస్తులంతా ఏకమై వారిని నోటికి వచ్చినట్లు బూతులతో మీకు ఎక్కడిది రా భూమి అంటూ దూషణ దిగారు. ఇట్టి భూమి వివరము ఏమనగా ఉత్తర్వు నెంబర్ 5927/96 అప్పటి ప్రభుత్వం సర్వేనెంబర్ 623 లో కోడి రాములకు రెండు ఎకరాల వ్యవసాయ భూమిని లావుని పట్టాగా సర్టిఫికెట్ ఇచ్చినారు. అప్పటినుండి కోడి రాములు కుటుంబం సాగులో ఉండి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండగా ఆర్థిక ఇబ్బందుల వలన కొంతకాలం తర్వాత ముంబైకి వలస వెళ్ళగా మంగదొడ్లగూడెం భూస్వాములు అప్పటి మునుగోడు మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న ప్రోద్బలంతో మండల రెవెన్యూ అధికారి జక్కర్తి శ్రీనివాస్ ను తప్పుతోవ పట్టించి అట్టి భూమిని తప్పుడు సర్వే చేయించి భూస్వాములకు అనుగుణంగా ఒక ఎకరం భూమిని పట్టేదారులేని సమయంలో హద్దురాలు నాటించారు.ఈ విషయంపై వలస వెళ్లిన కోడి రాములు ముంబై నుండి తన స్వగ్రామానికి వచ్చి ఇదేంటి అని మంగదొడ్లగూడెం వాసులను అడుగగా ఇది మా కోసం ఎమ్మార్వో ఇచ్చిన భూమి అని అతనిపై కొట్లాటకు దిగారు.ఇట్టి భూమి విషయంపై రాములు నల్లగొండ జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోగా శనివారం రోజున విచారణ నిమిత్తం స్థానిక మండల రెవెన్యూ అధికారి నేలపట్ల నరేష్,ఆర్ఐ వంశీ,సర్వేయరు,జిపిఓ లతో సహా అతి భూమిని పంచనామా చేసి సర్వే నిర్వహించగా అటు గూడెం వాసులను ఎమ్మార్వో మీకేమైనా అప్పటి ఎంఆర్ఓ ఇట్టి భూమికి సంబంధించిన పత్రాలు ఏమైనా మీకు ఇచ్చారా అని అడగగా మాకు ఏమీ ఇవ్వలేదని సమాధానం చెప్పారు. పట్టాదారు కోడి రాములు కు ఇచ్చిన పట్టా భూమి కంటే సర్వే చేయగా తక్కువ రావడంతో తాసిల్దార్ నరేష్ ఇట్టి విషయం పై అధికారులకు సిఫారసు చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## వరమ్మ గారి దశదినకర్మకు రాజకీయ, సామాజిక ప్రముఖుల హాజరు

**కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన నాయకులు**



**కురవి, విశాల భారతి ):** కురవి మండలానికి చెందిన గౌడ సంఘ ప్రముఖులు బండారి రమేష్ గౌడ్ తల్లి వరమ్మ గారి దశదినకర్మ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక వర్గాలకు చెందిన ప్రముఖులు హాజరై వరమ్మ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగాని శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ అంబటి వీరభద్రం గౌడ్, మహబూబాబాద్ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని వరమ్మ గారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వరమ్మ గారి మృతి బాధాకరమని, ఆమె మరణం కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరుతూ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో కురవి మాజీ సర్పంచ్ బానోత్ తుకారాం నాయక్, కురవి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజేందర్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ వీరన్న, రజినీకుమార్, దైద భద్రయ్య, వద్దుల ప్రశాంత్ రెడ్డి, కనకటి శ్రావణ్ గౌడ్, కల్లెపు శ్రీనివాస్ గౌడ్, బాదావత్ లక్ష్మణ్ నాయక్, గోరు రాజన్న గౌడ్, మోదుగులగూడెం సర్పంచ్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. అలాగే టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, కురవి మండల అధ్యక్షుడు గుంటి సురేష్, ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి, సీపీఐ నాయకులు కన్నెం వెంకన్న, తురక రమేష్ తదితరులు హాజరై వరమ్మ గారికి నివాళులు అర్పించారు. దశదినకర్మ సందర్భంగా పెద్ద సంఖ్యలో బంధువులు, స్నేహితులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు హాజరై కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. వరమ్మ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## సర్పంచ్ సోమన్న కుటుంబానికి సత్యవతి రాథోడ్ అండ

**రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసి కుటుంబ సభ్యులకు భరోసా**



**మరిపెడ, విశాల భారతి:** డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండలం వెంకంపాడు గ్రామ సర్పంచ్ ఉప్పల సోమన్న ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకురాలు శ్రీమతి సత్యవతి రాథోడ్ శనివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వెంకంపాడు గ్రామానికి చేరుకున్న ఆమె సోమన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం సోమన్న కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సోమన్న మృతి పట్ల సత్యవతి రాథోడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీఆర్ఎస్ యువ నాయకుడు గుగులోత్ శ్రీరామ్ నాయక్, మాజీ సర్పంచ్ వనజా శ్రీరామ్, కొంపల్లి వేణుగోపాల్ రెడ్డి, పెదబోయిన రంగన్న, రామగాని లింగమూర్తి, మాజీ సర్పంచ్ రాజునాయక్, గ్రామ పార్టీ మాజీ అధ్యక్షుడు రమేష్, దండ రాములు, బుర్ర అవిలయ్య, లక్‌పతి తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి



**మరిపెడ, విశాల భారతి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ అల్వాల వీరయ్య డిమాండ్ చేశారు. మరిపెడలో కామ్రేడ్ తాటికొండ అనంతచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులతో పాటు రాష్ట్రంలో పోలీస్, డీఎస్సీ, గ్రూప్స్ తదితర ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, స్థానిక పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఉండగాని మధుసూదన్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఫిజికల్ లిటరసీతో విద్యార్థుల్లో ఆరోగ్యం, ఏకాగ్రత పెంపు



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** విద్యార్థులు చదువుతో పాటు శారీరక వ్యాయామం, క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి డా. ఓలేటి జ్యోతి సూచించారు. తెలంగాణ ప్రభుత్వం, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ సంయుక్తంగా చేపడుతున్న ఫిజికల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా శనివారం మహబూబాబాద్ తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఓలేటి జ్యోతి మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే శారీరక కార్యకలాపాలను అలవర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని తెలిపారు. ఫిజికల్ లిటరసీ కార్యక్రమం ద్వారా వివిధ రకాల శారీరక వ్యాయామాలు, క్రీడలు, శారీరక దారుఢ్యానికి సంబంధించిన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించి, వారిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేలా ఉపాధ్యాయులు, శారీరక విద్య ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డా. జి. శ్రీనివాస్ రావు, పీడీ నసీరుద్దీన్, సిబ్బంది మహేష్, రామన్న, సాజిద్, నరేందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆనేపురంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**మరిపెడ విశాల భారతి:** ఆనేపురం గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మల్లికంటి రాజు, ఉపాధ్యక్షుడిగా దామెర్ల ప్రవీణ్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మల్లికంటి రాజు, ఉపాధ్యక్షుడు దామెర్ల ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి మరింత పటిష్ఠమైన పునాది వేస్తామని పేర్కొన్నారు.గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నికతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## దేవరుప్పుల పీహెచ్‌సీలో పాత పేర్లతోనే ఆర్టీఐ బోర్డు




**దేవరుప్పుల విశాల భారతి :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ-2005) బోర్డుపై అధికారులు బదిలీ అయినా ఏళ్లుగా పాత పేర్లు, ఫోన్ నంబర్లే కొనసాగుతున్నాయని సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ జనగామ జిల్లా కార్యదర్శి నల్ల విక్రమ్ కుమార్ ఆరోపించారు. పీహెచ్‌సీలో గతంలో విధులు నిర్వహించిన సహాయ పౌర సమాచార అధికారిగా సీనియర్ అసిస్టెంట్ కె. రాములు, పౌర సమాచార అధికారిగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె. భాస్కర్, అప్పిలేట్ అధికారిగా డాక్టర్ మహేందర్ పేర్లు, వారి పాత ఫోన్ నంబర్లు నేటికీ బోర్డుపై ఉన్నాయని తెలిపారు. దీంతో ఆసుపత్రి సేవలు, నిధులు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం కోసం వచ్చే ప్రజలు, దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బోర్డుపై ఉన్న నంబర్లకు ఫోన్ చేస్తే అవి పనిచేయకపోవడం లేదా ఇతర ప్రాంతాల్లోని వ్యక్తులకు కాల్స్ వెళ్లడం జరుగుతోందని పేర్కొన్నారు. అధికారులు వెంటనే పాత బోర్డును తొలగించి, ప్రస్తుతం బాధ్యతల్లో ఉన్న అధికారుల పేర్లు, అధికారిక ఫోన్ నంబర్లతో కొత్త సమాచార బోర్డును ఏర్పాటు చేయాలని నల్ల విక్రమ్ కుమార్ డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం సమాచార బోర్డులను ఎప్పటికప్పుడు నవీకరించని బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులను కోరారు.

## కడవెండిలో శిలాఫలకానికే పరిమితమైన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్





**దేవరుప్పుల విశాల భారతి :** మండలం కడవెండి గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమైందని బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. రూ.20 లక్షల ఎన్‌హెచ్‌ఎం 2022-23 నిధులతో చేపట్టిన ఈ నిర్మాణానికి 2025 ఆగస్టు 22న ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి శంకుస్థాపన చేసినట్లు నాయకులు తెలిపారు. ఏడాది పూర్తయినా నిర్మాణం బేస్‌మెంట్ స్థాయిని దాటలేదని ఆరోపించారు. ఈ సందర్భంగా శిలాఫలకానికి పూల బొకే అందించి, నిర్మాణానికి ఏడాది పూర్తయిన సందర్భంగా శుభాకాంక్షలు అంటూ నిరసన వ్యక్తం చేశారు.నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ భాషిపాక రాములు, ఉపసర్పంచ్ నక్క రేణుక, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తాటిపల్లి మహేష్, సుడిగెలి హనుమంతు, నక్క రమేష్, రత్నాకర్ రెడ్డి, సాయిలు, అజయ్, ప్రభాకర్, సతీష్, బాల నర్సయ్య, గట్టయ్య, నాగేష్, ఆంజనేయులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## హెజెలో కంపెనీలో రియాక్టర్ పేలి ఇద్దరు కార్మికుల మృతి మరో 9 మందికి తీవ్ర గాయాలు



**చౌటుప్పల్,విశాల భారతి:**

యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం దోతిగూడెం పరిధిలోని హెజెలో కంపెనీలో శుక్రవారం రాత్రి భారీ విషాదం చోటుచేసుకుంది. కంపెనీలోని కెమికల్ రియాక్టర్ ఒక్కసారిగా పేలడంతో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 9 మంది తీవ్రంగా గాయపడగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

**ఘటన వివరాలు:** శుక్రవారం రాత్రి సుమారు 10:00 నుండి 10:30 గంటల మధ్య కార్మికులు షిఫ్టులు మారే సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో రియాక్టర్ పేలి మంటలు చెలరేగాయి. పేలుడు ధాటికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గాయపడిన వారిని వెంటనే హైదరాబాద్ లోని సన్ రైజ్ హాస్పిటల్ మరియు హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్ కు తరలించి కంపెనీ యాజమాన్యం చికిత్స అందిస్తోంది.

**మృతుల వివరాలు:**

1. చెన్ను నాగిరెడ్డి తండ్రి సైదిరెడ్డి చెన్నూరు గ్రామం, పెద్దాపురం మండలం, నల్గొండ జిల్లా
2. గంగబోయిన నరేష్ చౌడారం గ్రామం, ఖమ్మం జిల్లా
3. వీరి మృతదేహాలను గాంధీ హాస్పిటల్ మార్చురీకి తరలించారు.

**అధికారుల విచారణ:**

ఈ ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా జాయింట్ కలెక్టర్ భాస్కర్ రెడ్డి, పరిశ్రమల ఇన్స్పెక్టర్, పీసీబీ అధికారులు, జిల్లా కార్మిక శాఖ అధికారులు శనివారం పరిశ్రమను సందర్శించి ప్రమాదానికి గల కారణాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. రెండు మూడు రోజుల్లో కంపెనీని సీజ్ చేస్తామని, మృతి చెందిన మరియు గాయపడ్డ కార్మికుల కుటుంబాలకు యాజమాన్యం నుండి తగిన పరిహారం ఇప్పించి న్యాయం చేస్తామని జాయింట్ కలెక్టర్ భాస్కర్ రెడ్డి తెలిపారు. రసాయన పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక పాఠశాలల తనిఖీలపై కలెక్టర్ సమీక్ష



- **విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి.**
- **తనిఖీలను సమగ్రంగా నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి:**
- **మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

**మహబూబాబాద్ జిల్లా, విశాల భారతి:**

మహబూబాబాద్ జిల్లాలోని ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులు, బోధన-అభ్యసన ప్రక్రియ తదితర అంశాలపై చేపడుతున్న తనిఖీలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సమీక్షించారు. పాఠశాలల పనితీరును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల తనిఖీలు కేవలం రికార్డుల పరిశీలనకే పరిమితం కాకుండా, విద్యార్థుల వాస్తవ అభ్యసన స్థాయిని క్షేత్రస్థాయిలో అంచనా వేసేలా ఉండాలని సూచించారు. విద్యార్థుల హాజరు, బోధనా విధానం, అభ్యసన సామర్థ్యం, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. పాఠశాలల్లో తనిఖీల సందర్భంగా గుర్తించిన సమస్యలను స్పష్టంగా నమోదు చేసి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ప్యానెల్ తనిఖీ బృందాలకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పాఠశాల స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలను గుర్తించి, వాటిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలల తనిఖీల కోసం 6 బృందాలు, ప్రాథమికోన్నత పాఠశాలల తనిఖీల కోసం 1 బృందాన్ని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రతి బృందం పాఠశాలలను సమగ్రంగా పరిశీలించి, గుర్తించిన అంశాలతో కూడిన నివేదికలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. తనిఖీ బృందాల సభ్యులకు పాఠశాలల పరిశీలనలో పాటించాల్సిన విధానాలు, పరిశీలించాల్సిన అంశాలు, గుర్తించిన సమస్యలను నమోదు చేసే విధానం, నివేదికల సమర్పణ, తదుపరి కార్యాచరణపై అధికారులు వివరించారు. పాఠశాలల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు విద్యాశాఖ అధికారులు, తనిఖీ బృందాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడం, బోధన-అభ్యసన ప్రక్రియను బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ మూర్తి, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, ఏఎంఓ వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## వెంకట్రాంపురం హైస్కూల్లో ఘనంగా మాక్ గ్రామసభ



**బయ్యారం విశాల భారతి:** విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, గ్రామ పాలన, ప్రజా సమస్యలపై అవగాహన పెంపొందించేందుకు వెంకట్రాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామసభ నిర్వహణ తీరును విద్యార్థులకు ప్రత్యక్షంగా పరిచయం చేయడంతో పాటు, గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, స్థానిక పాలనలో ప్రజాప్రతినిధులు, అధికారుల పాత్రను వివరించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామసభలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తుల పాత్రలను పోషిస్తూ పలు సమస్యలను సభ ముందుకు తీసుకువచ్చారు. గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, విద్యుత్, డ్రైనేజీ, పాఠశాల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను విద్యార్థులు తమదైన శైలిలో వివరించారు. గ్రామసభలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే విధానం, సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయడం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించడం వంటి అంశాలను మాక్ గ్రామసభ ద్వారా విద్యార్థులు తెలుసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంత ముఖ్యమో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, మాట్లాడే నైపుణ్యం, సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలను సూచించే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడింది. భవిష్యత్‌లో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మాక్ గ్రామసభలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామ పాలనపై అవగాహన కల్పించేలా పాఠశాల స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని పలువురు అభిప్రాయపడ్డారు.

## వర్షా భావ పరిస్థితుల్లో వరి సాగుకు దూరంగా ఉండాలి

**రైతులు సాగులో సాంకేతిక మెలకువలు పాటించాలి: ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి**



**మహబూబాబాద్ మరిపెడ విశాల భారతి:** తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి సాగుకు దూరంగా ఉండి, తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకోవాలని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకుంటే సాగు ఖర్చులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. మరిపెడ మండల కేంద్రంలోని ఏడీ కార్యాలయంలో నిర్వహించిన ఆత్మ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సాంప్రదాయక వరి సాగును తగ్గించాలని, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల వంటి తక్కువ నీటి అవసరం ఉన్న పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. రైతులు సాగులో ఆధునిక సాంకేతిక మెలకువలను పాటించడం ద్వారా పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుని అధిక లాభాలు పొందవచ్చన్నారు. అధిక మోతాదులో రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా సేంద్రియ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులకు సాగు పద్ధతులు, పంటల ఎంపిక, సేంద్రియ వ్యవసాయం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధానాలపై అవగాహన కల్పించేందుకు ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఆయా మండల కేంద్రాల్లో నిపుణులతో శిక్షణ తరగతులు, వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నల్లు సుధాకర్ రెడ్డి తెలిపారు. రైతులు ఈ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డివిజన్ వ్యవసాయ సంచాలకులు మురళి, సాంకేతిక వ్యవసాయ అధికారి శ్రీదేవి, ఆత్మ కమిటీ సభ్యులు, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం చొరవ..పేదోడి కళ్లలో ఆనందం. ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి

- సొంతింటి కలను నెరవేర్చిన ఘటన కాంగ్రెస్ పార్టీది
- లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ
- మంత్రి పొంగులేటి తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే భూపతి రెడ్డి




**నిజామాబాద్, జిల్లా విశాల భారతి:** రాష్ట్రంలో సొంతిల్లు లేని పేదోళ్లు ఉండకూడదన్న బృహత్తరమైన ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన ముందుకు సాగుతోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు. శనివారం డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించగా.. రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లతో కలిసి పాల్గొన్నారు.

**ముందుగా తెలంగాణ రాష్ట్ర గీతాలాపన తో కార్యక్రమాన్ని ప్రారంభించారు.**

అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ... పేదవాడి కళ్లల్లో ఆనందం నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు సంక్షేమ ఫలాలు, మరోవైపు అభివృద్ధి పనులు చేపడుతూ వారి కలలను సాకారం చేస్తోందని తెలిపారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ పాలనలో పేదవాడికి సొంతింటి కల కలగానే మిగిలిందని చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు సుమారు 4 లక్షల పైచిలుకు ఇళ్లు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్ లు శేఖర్ గౌడ్, తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ పోలీస్ అకాడమీలో రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి 157వ జయంతి వేడుకలు



**రాజేంద్రనగర్,విశాల భారతి:** రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి 157వ జయంతి వేడుకలను రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో అకాడమీ అధికారులు, ఆర్‌బీవీఆర్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ ప్రాంగణంలోని రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి విగ్రహానికి అకాడమీ అధికారులు, పోలీస్ అధికారులు, ఆర్‌బీవీఆర్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**పోలీస్ వ్యవస్థకు వెంకట రామిరెడ్డి ఆదర్శం**

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ, రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి పేరు తెలంగాణ పోలీస్ అకాడమీతో పాటు మొత్తం పోలీస్ వ్యవస్థకు నిరంతరం స్ఫూర్తినిస్తోందన్నారు. పేదలు, బలహీన వర్గాల ప్రజలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, పోలీస్ సేవలకు ఆయన నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శిక్షణార్థుల సంక్షేమం కోసం ఆయన ఏర్పాటు చేసిన నిధి ద్వారా శిక్షణార్థుల పట్ల ఆయనకున్న శ్రద్ధ, దూరదృష్టి స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఆయన పేరుతో తెలంగాణ పోలీస్ అకాడమీని అభివృద్ధి చేసుకోవడం గర్వకారణమని తెలిపారు. భవిష్యత్ పోలీస్ అధికారులకు వెంకట రామిరెడ్డి జీవితం, సేవలు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

**విద్యారంగంలో విశేష సేవలు**

ఆర్‌బీవీఆర్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు కొండ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ, రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. విద్య ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేసేందుకు అనేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసి, ఎంతోమందికి విద్యావకాశాలు కల్పించారని కొనియాడారు. సమాజ సేవ, విద్యాభివృద్ధి, ప్రజా సేవలో ఆయన చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు.

**వెంకట రామిరెడ్డి పోలీసింగ్ శైలి ఆదర్శనీయం**

రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి బాల్యం, ఆయన ఎదిగిన తీరు, పోలీస్ శాఖలోకి వచ్చిన విధానం తదితర అంశాలను వివరించారు. నిజాం కాలంలో హైదరాబాద్ కొత్వాల్‌గా ఆయన నిర్వహించిన బాధ్యతలు, ప్రజలతో ఆయన వ్యవహరించిన తీరు, పోలీసింగ్‌లో ఆయన అనుసరించిన ప్రత్యేక విధానాలను వివరించారు.

# నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ ఉక్కుపాదం!





- డోర్నకల్, కురవి మండలాల్లో ఏకకాలంలో విస్తృత దాడులు
- ఏడుగురిపై కేసులు.. 21 లీటర్ల నాటుసారా స్వాధీనం
- 900 బెల్లం పానకం ధ్వంసం.. నిందితుల బైండ్‌ఓవర్

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:**

మహబూబాబాద్ జిల్లాలో నాటుసారా తయారీ, నిల్వ, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ కొరడా ఝుళిపించింది. నాటుసారా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఎక్సైజ్, పోలీస్, ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలు శనివారం విస్తృతంగా దాడులు నిర్వహించాయి. వరంగల్ ఎన్ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె. నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడులు నాటుసారా తయారీదారుల్లో కలకలం రేపాయి. మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని డోర్నకల్ మండలం ముల్కాలపల్లి, తోడేళ్లగూడెం, టేకులతండా, బూరుగుపాడు, తెల్లబండతండా గ్రామాలతో పాటు కురవి మండలం జగ్యతండాలో అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్, డీటీఎఫ్ మహబూబాబాద్, డోర్నకల్ పోలీసులు, వరంగల్ ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలు సంయుక్తంగా రంగంలోకి దిగి నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు జరిపాయి.

**ఏడుగురిపై కేసులు.. భారీగా సామగ్రి ధ్వంసం.**

దాడుల్లో ఏడుగురు నిందితులపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. వారి నుంచి 21 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీకి వినియోగించేందుకు సిద్ధంగా ఉంచిన 900 బెల్లం పానకాన్ని గుర్తించి ధ్వంసం చేశారు. పట్టుబడిన నిందితులను సంబంధిత డోర్నకల్ తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండ్‌ఓవర్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

**ముల్కాలపల్లిలో ఐదుగురిపై కేసులు.**

ముల్కాలపల్లికి చెందిన కె. వసంత, జె. తిరుపతమ్మ, బి. తులసి, బి. విజయ, కె. దుర్గాభవానిపై కేసులు నమోదు చేశారు. అలాగే తోడేళ్లగూడెంకు చెందిన చె. రామకృష్ణ, చె. మధుకర్‌పై కూడా కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

**నాటుసారా తయారీపై కఠిన చర్యలు.**

గ్రామీణ ప్రాంతాల్లో నాటుసారా తయారీ, నిల్వ, విక్రయాలను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. నాటుసారా తయారీకి సంబంధించిన సమాచారం అందిన ప్రాంతాల్లో నిఘా పెంచడంతో పాటు అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నాటుసారా తయారీకి పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**అధికారుల సమన్వయంతో దాడులు.**

ఈ విస్తృత దాడుల్లో ఎక్సైజ్ సీఐలు జి. చిరంజీవి, కె. నాగయ్య, చె. నీరజ, జి. చంద్రశేఖర్, ఐ. అశోక్‌కుమార్, డోర్నకల్ పోలీస్ ఎస్‌ఐ రియాజ్ పాషా, ఎక్సైజ్ ఎస్‌ఐ ఆర్. కిరీటి, ట్రైనీ ఏఈఎస్ నీలోఫర్ అజ్మి, హెడ్ కానిస్టేబుళ్లు బుచ్చయ్య, లలితారాణి, కానిస్టేబుళ్లు హరీష్, జాన్‌పాషా, నాగరాజు, లాలు తదితరులు పాల్గొన్నారు. నాటుసారా మహమ్మారిని అరికట్టేందుకు దాడులను మరింత ముమ్మరం చేస్తామని ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు. గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సీఎంఆర్ బియ్యం డెలివరీలో డిఫాల్ట్ మిల్లర్లపై కొరడా

- ఐదు రైస్ మిల్లులపై కేసులు
- మిషన్ కె-100లో మరో మూడు మిల్లర్లపై చర్యలు
- ప్రభుత్వ బకాయిల రికవరీకి పౌరసరఫరాల శాఖ కఠిన చర్యలు




**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:**

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బియ్యం డెలివరీలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లపై మహబూబాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి సీఎంఆర్ బియ్యం అందించడంలో నిర్లక్ష్యం వహించిన మిల్లర్లపై కేసులు నమోదు చేయడంతో పాటు, ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను రికవరీ చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ (సివిల్ సప్లైస్) తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం ఐదు రైస్ మిల్లులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "మిషన్ కె100" కార్యక్రమంలో భాగంగా మరో మూడు డిఫాల్ట్ రైస్ మిల్లులపై కేసులు నమోదు చేసి, ఆయా మిల్లర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను రికవరీ చేసినట్లు తెలిపారు. మిషన్ కె100లో భాగంగా కేసముద్రంలోని శ్రీ తిరుమల బిన్నీ రైస్ మిల్లు, శ్రీ బాలాజీ ఆగ్రో ఇండస్ట్రీస్ తదితర డిఫాల్ట్ రైస్ మిల్లులపై కేసులు నమోదు చేసి, ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను వసూలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

**ధనలక్ష్మి ఇండస్ట్రీస్‌పై కేసు.**

వెంగంపేటకు చెందిన ధనలక్ష్మి ఇండస్ట్రీస్ రైస్ మిల్లు ఖరీఫ్ 2023-24 సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ బియ్యం డెలివరీలో డిఫాల్ట్ అయినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీఎంఆర్ బకాయిలను సకాలంలో చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచినట్లు గుర్తించిన అధికారులు, సంబంధిత మిల్లర్‌కు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. బకాయిలను వెంటనే చెల్లించాలని ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు చెల్లించకపోవడంతో ధనలక్ష్మి ఇండస్ట్రీస్‌పై సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

**డిఫాల్ట్‌లను ఉపేక్షించం.**

ప్రభుత్వ ధాన్యం, సీఎంఆర్ బియ్యం డెలివరీ, ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిల విషయంలో ఎలాంటి డిఫాల్ట్‌లు, అవకతవకలను ఉపేక్షించబోమని అధికారులు స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించని రైస్ మిల్లర్లపై చట్టపరమైన చర్యలతో పాటు, ప్రభుత్వ బకాయిల రికవరీ కోసం కఠిన చర్యలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ప్రభుత్వ ధాన్యానికి సంబంధించిన లావాదేవీల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా చర్యలు చేపడుతున్నామని, సీఎంఆర్ బియ్యం డెలివరీలో డిఫాల్ట్ చేసే మిల్లర్లపై ఇకపై కూడా కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ అధికారులు స్పష్టం చేశారు.

## చందానగర్ ఠాణాలో లంచం బాగోతం



**రూ.75 వేల లంచం తీసుకుంటూ ఎస్ఐ, కానిస్టేబుల్ ఏసీబీకి చిక్కిన వైనం**

**సైబరాబాద్ - విశాల భారతి**

పోలీస్‌స్టేషన్‌లో లంచం బాగోతం బట్టబయలైంది. కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు ఫిర్యాదుదారుడి నుంచి డబ్బులు డిమాండ్ చేసిన చందానగర్ ఎస్ఐ బండెల బలరాజ్, కానిస్టేబుల్ బొట్టా రాఘవేంద్ర కుమార్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. రూ.75 వేల లంచం సొమ్ము స్వీకరిస్తుండగా రంగారెడ్డి రేంజ్ ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. లంచం సొమ్మును ఎస్ఐ టేబుల్ సొరుగులో నుంచి స్వాధీనం చేసుకున్నారు.చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నంబర్ 696 కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఎస్ఐ బండెల బలరాజ్, కానిస్టేబుల్ బొట్టా రాఘవేంద్ర కుమార్ కలిసి ఫిర్యాదుదారుడిని డబ్బులు ఇవ్వాలని కోరినట్లు ఏసీబీ విచారణలో వెల్లడైంది. ఇప్పటికే బాధితుడి నుంచి రూ.20 వేల నగదును, మరో రూ.10 వేల మొత్తాన్ని యూపీఐ ద్వారా కానిస్టేబుల్ రాఘవేంద్ర కుమార్ తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. అయినప్పటికీ పని పూర్తి చేయాలంటే మరో రూ.75 వేలు ఇవ్వాల్సిందేనంటూ ఇద్దరూ ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. పోలీసుల నుంచి లంచం కోసం ఒత్తిడి పెరగడంతో విసిగిపోయిన బాధితుడు రంగారెడ్డి రేంజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఫిర్యాదును స్వీకరించిన అధికారులు వాస్తవాలను నిర్ధారించుకుని పక్కా ప్రణాళికతో వల పన్నారు. రంగారెడ్డి రేంజ్ ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎం. సందీప్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు ఈ. బాలరాజు, ఏ. వెంకటయ్య, ఎస్.వి. రామిరెడ్డి, ఎన్. రాజశేఖర్, బి. వెంకటేశ్వర్లుతో కూడిన ప్రత్యేక బృందం దాడికి సిద్ధమైంది. ప్రణాళికలో భాగంగా ఏసీబీ అధికారులు రసాయనం పూసిన రూ.75 వేల నగదును ఫిర్యాదుదారుడికి అందజేశారు. ఆ మొత్తాన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి సంబంధిత అధికారులకు ఇవ్వాలని సూచించారు. ముందస్తు వ్యూహం ప్రకారం ఏసీబీ బృందం చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో మాటువేసింది. ఫిర్యాదుదారుడి నుంచి ఎస్ఐ బలరాజ్ రూ.75 వేల నగదు తీసుకున్న వెంటనే ఏసీబీ అధికారులు ఒక్కసారిగా రంగంలోకి దిగారు. లంచం సొమ్మును ఎస్ఐ టేబుల్ సొరుగులో గుర్తించిన అధికారులు దానిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రసాయన పరీక్షలు నిర్వహించి లంచం స్వీకరించినట్లు నిర్ధారించారు. ఈ వ్యవహారంలో ఎస్ఐ బలరాజ్‌తో పాటు కానిస్టేబుల్ రాఘవేంద్ర కుమార్ పాత్రపైనా అధికారులు దర్యాప్తు చేపట్టారు. గతంలో తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రూ.20 వేల నగదు, యూపీఐ ద్వారా చెల్లించిన రూ.10 వేల వివరాలను కూడా ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.లంచం డిమాండ్ చేసినట్లు నిర్ధారణ కావడంతో ఎస్ఐ బండెల బలరాజ్, కానిస్టేబుల్ బొట్టా రాఘవేంద్ర కుమార్‌లపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి అధికారికంగా అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న నగదును కేసు ఆస్తిగా నమోదు చేశారు. నిందితులను నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు.

## నూతన ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్‌కు శుభాకాంక్షలు



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** జిల్లా నూతన ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన కరంచంద్‌ను నిజం న్యూస్ స్టేట్ బ్యూరో శ్రీనివాస్ నాయక్, ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో నిమ్మల నరేష్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్కను అందజేసి అభినందనలు తెలియజేశారు. నూతన బాధ్యతలు చేపట్టిన కరంచంద్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లాలో ఎక్సైజ్ శాఖ మరింత సమర్థవంతంగా పనిచేయాలని వారు ఆకాంక్షించారు. జిల్లాలో అక్రమ మద్యం, అక్రమ రవాణా వంటి కార్యకలాపాల నియంత్రణతో పాటు ప్రభుత్వ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఎక్సైజ్ శాఖలో నూతన నాయకత్వంతో మరింత పారదర్శకత, సమర్థత పెరిగి మంచి ఫలితాలు సాధించాలని శ్రీనివాస్ నాయక్, నిమ్మల నరేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్‌కు తమ తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## బయ్యారంలో డిజిటల్ స్మార్ట్ కార్డుల పంపిణీ



**బయ్యారం, విశాల భారతి:** బయ్యారం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్ వార్డు, సర్దార్ వార్డు తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బయ్యారం గ్రామ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్, జెగ్గుతండా గ్రామ సర్పంచ్ బొల్లి జయంతి వెంకట కృష్ణ పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందజేశారు. బయ్యారం గ్రామపంచాయతీ పరిధిలోని కిషన్, సర్దార్ వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమానికి బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్, జెగ్గుతండా సర్పంచ్ బొల్లి జయంతి వెంకట కృష్ణ, బయ్యారం ఉపసర్పంచ్ ఎనుగుల ఉమా రంజిత్, జెగ్గుతండా ఉపసర్పంచ్ గుంజ వీరాస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుదారులకు సర్పంచ్ శాంతి కిషన్ నాయక్, ఉపసర్పంచ్ ఎనుగుల ఉమా రంజిత్ చేతుల మీదుగా డిజిటల్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. కొత్త స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్ లబ్ధిదారులకు మరింత పారదర్శకంగా, సులభంగా ప్రభుత్వ సేవలు అందే అవకాశం ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో బయ్యారం రెవెన్యూ పరిశీలకుడు ఉపేందర్, పంచాయతీ అధికారి ప్రభాకర్, కార్యదర్శి రాంబాబు, మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంబాల ముసలయ్య, మాజీ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్ రెడ్డితో పాటు వార్డు సభ్యులు బట్టు ఉమా, ఎట్టి సరిత, పెద్దిని శాంత, తాటి జనార్దన్, పులి మల్లయ్య, నందిపాటి భవాణి, ఆకునూరి సూర్యనారాయణ, తునికిపాటి క్రాంతి, నాగేందర్, జెగ్గుతండా వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, రేషన్ కార్డుదారులు తదితరులు పాల్గొన్నారు.

## మణికొండ–ఓయూ కాలనీ రోడ్డు విస్తరణకు తక్షణ చర్యలు చేపట్టాలి

**ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం**




**రాజేంద్రనగర్,విశాల భారతి:** మణికొండ-ఓయూ కాలనీ రహదారిపై రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపాలని మణికొండ ప్రజా ఐక్య వేదిక డిమాండ్ చేసింది. శనివారం వేదిక కన్వీనర్ సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో మణికొండ, పరిసర కాలనీలకు చెందిన ప్రజలు మర్రిచెట్టు వద్ద సమావేశమై, అక్కడి నుంచి ఓయూ కాలనీ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ.. మర్రిచెట్టు-ఓయూ కాలనీ రోడ్డుపై సాధారణ సమయాల్లోనే తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఉంటోందని, పీక్ అవర్స్‌లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందన్నారు. వాహనదారులు, పాదచారులు, వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఫైర్ టెండర్లు సైతం సులభంగా వెళ్లలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా రహదారి సామర్థ్యాన్ని వెంటనే పెంచాలని, ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రహదారి, పాదచారుల మార్గాలకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తక్షణమే తరలించి, పాదచారులు సురక్షితంగా నడిచేలా ఫుట్‌పాత్‌లను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

**ప్రజా ధనంతో నిర్మించిన రహదారి ప్రజలకే వినియోగించాలి**

రెండేళ్ల క్రితం ప్రజా పన్నుల సొమ్ముతో సుమారు రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించిన ట్రైల్స్ రోడ్ నంబర్ 10, పంచవటి కాలనీ బాక్స్ డ్రెయిన్ కమ్ రహదారి ప్రజా ఆస్తి అని తెలిపారు. అలాంటి ప్రజా ఆస్తిని ఒక బిల్డర్ వినియోగానికి వదిలేయడం ఎంతమాత్రం సమంజసం కాదని, వెంటనే ఆ రహదారిని ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే శివపురి నుంచి చిత్రపురి వరకు జనచైతన్య కాలనీ మీదుగా ప్రత్యామ్నాయ రహదారిని నిర్మిస్తే ప్రస్తుత రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. ఇదే రోడ్డులో ఉన్న ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ కార్యాలయాన్ని కూడా ప్రత్యామ్నాయ ప్రదేశానికి తరలించి అదనపు ట్రాఫిక్ రద్దీని తగ్గించాలని సూచించారు.

**సెట్‌బ్యాక్‌లు రోడ్డు విస్తరణకే వినియోగించాలి**

చట్టపరంగా వినియోగించదగిన అన్ని సెట్ బ్యాక్‌లను రహదారి విస్తరణకు మాత్రమే వినియోగించాలని ప్రజా ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. వాటిని వాణిజ్య పార్కింగ్ స్థలాలుగా ఉపయోగించడం వల్ల రహదారి అందుబాటులో ఉన్న వెడల్పు మరింత తగ్గి ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తమ డిమాండ్లన్నింటినీ స్పష్టమైన కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక ద్వారా అమలు చేయాలని కోరారు.

# స్కూల్ బస్సుకు తప్పిన పెను ప్రమాదం..!

- ఓవర్‌స్పీడ్‌తో లారీని ఢీకొట్టిన ప్రైవేట్ స్కూల్ బస్సు
- బస్సులో 50 మందికి పైగా విద్యార్థులు
- క్షణకాలం ఆలస్యమైతే పరిస్థితి ఏంటి..?
- డ్రైవర్ నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం
- విద్యార్థుల భద్రతపై అధికారుల పర్యవేక్షణ ఏది?




**మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ విశాల భారతి):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో ప్రైవేట్ పాఠశాల బస్సుకు పెను ప్రమాదం తప్పింది. విద్యార్థులను తీసుకెళ్తున్న సెయింట్ పాల్స్ స్కూల్‌కు చెందిన బస్సు లారీని ఢీకొట్టిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 50 మందికి పైగా విద్యార్థులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అదృష్టవశాత్తూ విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. స్థానికుల వివరాల ప్రకారం.. స్కూల్ బస్సు అధిక వేగంతో వెళ్తూ లారీని క్రాస్ చేసే సమయంలో డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించకపోవడంతో లారీని ఢీకొట్టినట్లు తెలుస్తోంది. లారీ డ్రైవర్ వాహనాన్ని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ స్కూల్ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. దీంతో ఒక్కసారిగా బస్సులో ఉన్న విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు.

**50 మందికి పైగా విద్యార్థులు.. ఒక్కసారిగా కలకలం.**

విద్యార్థులతో నిండిన బస్సు ప్రమాదానికి గురికావడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తమ పిల్లలకు ఏమైందోనన్న భయంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలియడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. ఒకవైపు పిల్లలను సురక్షితంగా పాఠశాలకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ.. మరోవైపు బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనం నడిపితే పరిస్థితి ఎంతటి విషాదానికి దారితీస్తుందో ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోందని స్థానికులు అంటున్నారు.

**డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమా?**

ప్రమాదానికి బస్సు డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యమే ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులతో ప్రయాణించే స్కూల్ బస్సులను అత్యంత జాగ్రత్తగా నడపాల్సిన అవసరం ఉన్నప్పటికీ కొందరు




డ్రైవర్లు వేగ నియంత్రణ పాటించకుండా వాహనాలు నడుపుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "విద్యార్థుల ప్రాణాలు ఎంతో విలువైనవి.. కేవలం సమయం ఆదా చేయడానికి వేగంగా బస్సులు నడపడం ఏమాత్రం సమర్థనీయం కాదు" అని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

**ప్రమాదం తప్పింది.. కానీ ప్రశ్నలు మిగిలాయి!**

ఈ ఘటనలో విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడం ఉపశమనకరమైన విషయమే అయినప్పటికీ.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. స్కూల్ బస్సుల వేగ నియంత్రణ, డ్రైవర్ల సామర్థ్యం, వాహనాల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలు, విద్యార్థుల రక్షణకు సంబంధించిన నిబంధనలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే.. ప్రమాదం జరగకముందే అప్రమత్తం కావడమే అసలు బాధ్యత అని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు.

**అధికారుల తనిఖీలు అవసరం.**

తొర్రూరు పట్టణంలో విద్యార్థులను తరలించే అన్ని ప్రైవేట్ పాఠశాల బస్సులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు. బస్సుల ఫిట్‌నెస్‌తో పాటు డ్రైవర్ల డ్రైవింగ్ తీరును కూడా పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పిల్లల భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం జరిగినా అది చిన్న తప్పిదంగా మిగలదు.. ఒక కుటుంబాన్నే విషాదంలోకి నెట్టే ప్రమాదం ఉంటుంది. తాజా ఘటనలో ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నప్పటికీ, ఇకపై ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పాఠశాల యాజమాన్యాలు, బస్సు డ్రైవర్లు, సంబంధిత అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## టిఆర్ఎస్ మదీనాగూడ డివిజన్ అధ్యక్షుడిగా కొల్లూరు కుమార్ కురుమ

**నియామక పత్రం అందజేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్**



**శేరిలింగంపల్లి విశాల భారతి :** తెలంగాణ రక్షణ సేన మదీనాగూడ డివిజన్ అధ్యక్షుడిగా కొల్లూరు కుమార్ కురుమ నియమితులయ్యారు. శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆయనకు నియామక పత్రాన్ని అధికారికంగా అందజేశారు. మదీనాగూడ ప్రాంతానికి చెందిన కుమార్ కురుమ కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ కార్యకర్తలను సమన్వయం చేస్తున్నారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆశయాలకు అనుగుణంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆయన పనిచేస్తున్నారని నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ.. కుమార్ కురుమ నియామకంతో మదీనాగూడ డివిజన్‌లో పార్టీ మరింత బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు కుమార్ కురుమ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు అలాగే నియోజకవర్గ ఇన్చార్జ్ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ రానున్న ఎన్నికల్లో విజయ పతాకాన్ని ఎగరవేసేలా నా శాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు. పార్టీలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అందరినీ కలుపుకొని శేరిలింగంపల్లిలో భవిష్యత్తులో తిరుగులేని రాజకీయ శక్తిగా ఎదిగేందుకు తన వంతు కృషి ఎల్లవేళలా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## బాలల రక్షణపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

**122 ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవగాహన**



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** బాలల రక్షణ, హక్కులు, చట్టపరమైన అంశాలపై ఉపాధ్యాయులు, బాలల రక్షణ అధికారులకు అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కె. మురళీ మోహన్, ఎస్పీ డాక్టర్ శబరిష్ పాల్గొన్నారు. ఉదయం ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమం సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. జిల్లాలోని 122 ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు బాలల రక్షణకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయ నిపుణులు, అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. బాలల హక్కులు, వారి భద్రత, బాలలపై జరిగే నేరాలను గుర్తించడం, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, చట్టపరమైన బాధ్యతలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో బాలల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, బాలల సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి వారికి అవసరమైన రక్షణ, సహాయం అందించేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలని అధికారులు సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి శాలిని షాకేలి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణకు పరేడ్ ప్రతీక

**పోలీసు సిబ్బంది ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి**

**గౌరవ వందనం స్వీకరించిన డీఎస్పీ ప్రసన్న కుమార్**

**చట్టం మెదక్ ప్రతినిధి :** పోలీసు శాఖలో క్రమశిక్షణ, సమన్వయం, సమయపాలనకు పరేడ్ ఎంతో కీలకమని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోలీసు పరేడ్‌కు ఆయన హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పరేడ్‌ను పరిశీలించి సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండటంతో పాటు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం అవసరమన్నారు. పరేడ్‌లో పాల్గొనడం ద్వారా సిబ్బందిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సమన్వయ భావన పెంపొందుతాయని తెలిపారు. విధి నిర్వహణలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేలా సిబ్బంది ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదగా మెలుగుతూ వారి సమస్యలను తెలుసుకుని చట్టపరంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ వ్యాయామం, పరేడ్ వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని తెలిపారు. అనంతరం పరేడ్‌లో పాల్గొన్న సిబ్బంది కవాతు, డ్రిల్, యూనిఫాం నిర్వహణ, క్రమశిక్షణ తదితర అంశాలను డీఎస్పీ పరిశీలించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మెదక్ టౌన్ సీఐ మహేష్, ఆర్ఐ లు శైలందర్, రామకృష్ణ, ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





## గ్యాస్ డెలివరీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా..



**-కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హామీ**
**హాజరైన మధు యాష్కీ గౌడ్**

**ఎల్బీనగర్ విశాల భారతి :**

తెలంగాణ రాష్ట్రం లో గ్యాస్ డెలివరీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ ఇక్కడ స్వామి హామీ ఇచ్చారు. శనివారం నాడు తెలంగాణ కుకింగ్ గ్యాస్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆరవ మహాసభ హైదరాబాదులోని కొత్తపేట బాబు జగ్జీవన్ భవన్ లో జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ గత పది సంవత్సరాలు టిఆర్ఎస్ ప్రభుత్వంలో కార్మికుల సమస్యలపై కష్టాలపై కనీసం చర్చించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కనీస వేతనాల చట్టం ఖచ్చితంగా అమలు చేయాలని కార్మికుల జీవితాల్లో కుటుంబాల్లో వెలుగు నింపాలని నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు .అందులో భాగంగానే కార్మికుల కనీస వేతన చట్టాన్ని అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో కార్మికులకు మంచి చేసే ఉద్దేశంతో కార్మికుల కుటుంబాలు గౌరవంతో ఆర్థిక స్వావలంబన తో బతికే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్మికులకు ఈఎస్ఐ పిఎఫ్ వసతి కల్పించేందుకు ఖచ్చితమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తన తండ్రి వెంకటస్వామి తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 100 యూనియన్లకు ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా పని చేశారని తన తండ్రి కార్మిక పక్షపాతి అని తాను కూడా కార్మిక పక్షపాతిగా పనిచేస్తానని వారు చెప్పారు. ఎల్పిజి గ్యాస్ డెలివరీ వర్కర్స్ సమస్యలు అన్ని పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు ఇస్తామని చెప్పారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి స్కిల్ వర్కర్లను తయారు చేసే ఉపాధి కల్పిస్తామని అందుకు ప్రభుత్వ కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కాకా వెంకటస్వామి కేంద్ర కార్మిక మంత్రిగా ఎంతోమంది కార్మికుల జీవితాల్లో వెలుగు నింపేందుకు పని చేశారని చెప్పారు. అటువంటి కార్మిక శాఖ మంత్రిగా వివేక్ రావడం తెలంగాణ రాష్ట్ర కార్మికుల పక్షాన చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో వేలాది మంది కార్మికులు గ్యాస్ డెలివరీ వర్కర్లుగా పనిచేస్తున్నారని .కార్మికుల సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లగానే మంత్రి వివేక్ స్పందించడం అత్యంత సంతోషకరమైన విషయమని కార్మిక శాఖ గల పక్షపాతిగా ఉండడం ఆనందదాయకమని చెప్పారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ముద్దగోని రామ్మోహన్ గౌడ్ తెలిపారు .తెలంగాణ కుకింగ్ గ్యాస్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిరంజీవులు చామకూర రాజు,కె వి గౌడ్ ప్రధాన కార్యదర్శి బుర్ర చంద్రయ్య ,వైస్ ప్రెసిడెంట్ పైసా నర్సింగ్, ఎండి యూనిస్, గడ్డం సత్యనారాయణ అశోక్, జిలుకర రవి, రావు, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్, హైదరాబాదు జిల్లా అధ్యక్షుడు ఎర్రోల్ల నర్సింగ్ రావ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రాజు గౌడ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అజయ్ రెడ్డి నాగర్ కర్నూలు జిల్లా జనరల్ సెక్రటరీ సోమ్లా నాయక్, ఉపాధ్యక్షుడు బంగారయ్య . సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నాగరాజు ప్రధాన కార్యదర్శి అంబటి రాజు, హైదరాబాద్ జిల్లా నుంచి ఆశిక్ కుమార్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి రేసులో సామిడి గోపాల్‌రెడ్డి





**26 ఏళ్ల పార్టీ సేవ, సీనియారిటీని గుర్తించి జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని అభ్యర్థన**

**అబ్దుల్లాపూర్ మెట్, విశాల భారతి :**

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడి నియామకంపై అభిప్రాయ సేకరణ కార్యక్రమం శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష పదవికి ఆశావహుల నుంచి అభిప్రాయాలను సేకరించడంతో పాటు వారి జీవిత చరిత్ర వివరాలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శి మోహన్, పార్టీ పరిశీలకులు, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాగమయి, శ్రీనివాస్‌రావుతో పాటు మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మధు యాష్కీగౌడ్ తదితరులు హాజరయ్యారు.

**26 ఏళ్ల సేవను గుర్తించాలని కోరిన గోపాల్‌రెడ్డి**

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్‌రెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి తన అభ్యర్థిత్వాన్ని తెలియజేస్తూ పరిశీలకులకు తన జీవిత చరిత్ర వివరాలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీలో గత 26 సంవత్సరాలుగా కొనసాగుతున్న తన సీనియారిటీని, పార్టీ బలోపేతానికి తాను చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని రంగారెడ్డి జిల్లా అధ్యక్ష పదవి తనకు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నానని గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా అధ్యక్ష పదవి లభిస్తే పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి హిల్స్ డివిజన్ 58కు చెందిన కాంగ్రెస్ నాయకులు, జిల్లా కమిటీ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పసుమాములలో ఘనంగా కాటమయ్య బోనాలు

- గౌడ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా వేడుకలు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బట్టసింగారం రైతు సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి



**అబ్దుల్లాపూర్ మెట్, విశాల భారతి :** పెద్ద అంబర్‌పేట్ డివిజన్ పరిధిలోని పసుమాముల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో కాటమయ్య బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు బట్టసింగారం రైతు సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాటమయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలు, గౌడ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.కొత్తపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాటమయ్య స్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో సంప్రదాయాలను కొనసాగిస్తూ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం పెద్దలు శంకరయ్య గౌడ్,బక్కి బాలకృష్ణ గౌడ్, కాటం భాస్కర్ గౌడ్, రాజు గౌడ్, జంగయ్య గౌడ్, చెట్టి రాజు గౌడ్, వాసు గౌడ్, శ్రీధర్ గౌడ్,శివలింగం గౌడ్, సతీష్ గౌడ్, సభ్యులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాజా బహదూర్ వెంకట రామారెడ్డి జయంతి సందర్భంగా ఘనంగా విగ్రహావిష్కరణ



**కాప్రా, విశాల భారతి :** రాజా బహదూర్ వెంకట రామారెడ్డి జయంతి సందర్భంగా రాధిక ఎక్స్ రోడ్ వద్ద ఆయన విగ్రహాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సమాజానికి, హైదరాబాద్ నగర అభివృద్ధికి రాజా బహదూర్ వెంకట రామారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజా సేవకు, విద్యాభివృద్ధికి, సామాజిక సంక్షేమానికి ఆయన అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా వారి ఆదర్శాలను భావితరాలకు చేరవేయవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో వాటర్ ఫిల్టర్ ప్రారంభం

**అస్మత్పూర్ గ్రామ సర్పంచ్ మంథని శివకుమార్ యాదవ్**




**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** మంచాల మండలం పరిధిలోని అస్మత్ గ్రామంలో గ్రామ సర్పంచ్ మంథని శివకుమార్ తన సొంత నిధులతో గ్రామంలో వాటర్ ఫిల్టర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొంగర విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంథని శివకుమార్ యాదవ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నీటి కొరత లేకుండా, నేటి సమాజంలో ప్యూరిఫై వాటర్ కు అలవాటు పడడం, గ్రామంలో ఉన్న ప్రజలు మంచినీటి సరఫరా ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, సర్పంచులు తుకారాం నాయక్, పీసీ తండా, సర్పంచ్ లక్ష్మయ్యా, అస్మత్పూర్ గ్రామ వార్డు సభ్యులు ఆనంద్, ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పందుల వల్ల అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు

- సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు స్పందించాలి
- జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అధ్యక్షులు నూకం కృష్ణ



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో పందులు గుంపులుగా సంచరిస్తుండటంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అధ్యక్షులు నూకం కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా నూకం కృష్ణ మాట్లాడుతూ వీధుల్లోనే కాకుండా పంట పొలాల్లోకి కూడా గుంపులుగా వెళ్లి పంటలను నాశనం చేస్తూ రైతులకు నష్టం కలిగిస్తున్నాయని తెలిపారు. పందుల సంచారం వల్ల గ్రామంలో అపరిశుభ్రత పెరగడంతో పాటు ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, చిన్నారులు, వృద్ధులు గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలని అధికారులను కోరారు. ఈ సమస్యపై సెప్టెంబర్ 1వ తేదీలోపు గ్రామ పాలక మండలి కార్యదర్శి తగిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.గడువులో సమస్య పరిష్కారం కాకపోతే, సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి అధికారికంగా ఫిర్యాదు చేస్తామని అన్నారు.

## వనస్థలిపురంలో వరహి షాపింగ్ మాల్ ప్రారంభం



**అబ్దుల్లాపూర్ మెట్, విశాల భారతి :** వనస్థలిపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన వరహి షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హయత్‌నగర్, బి.ఎన్.రెడ్డి డివిజన్ల మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు వరహి షాపింగ్ మాల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ వ్యాపారాన్ని విజయవంతంగా అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, నాయకులు ఇట్టబోయిన నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## భారత సైనికుడికి ఘనంగా సన్మానం

**విశాల భారతి, ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో శనివారం రోజు భారత ఆర్మీలో ఉద్యోగం సాధించి గత ఐదు సంవత్సరాలుగా అస్సాం రాష్ట్రంలో సైనికునిగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన వల్లెపు నవీన్, ను అంకాపూర్ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, కార్యదర్శి జి. రాజన్న, మంగళవారం బాజన్నతో పాటు కమిటీ సభ్యులు పాల్గొని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రామానికి చెందిన యువకుడు భారత ఆర్మీలో సేవలందిస్తూ గ్రామానికి, కుటుంబానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## హైదర్ నగర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌పై తప్పుడు ప్రచారం మానుకోవాలి



**కూకట్ పల్లి విశాల భారతి:** హైదర్ నగర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ విషయంలో కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రకటనలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు మరియు న్యాయవాది సిందం శ్రీకాంత్ యాదవ్ అన్నారు. హైదర్ నగర్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి ఐదు సంవత్సరాల క్రితమే సంబంధిత అన్ని శాఖల అనుమతులు వచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జెఎన్టియు ఇంజనీర్లు స్థలాన్ని పరిశీలించి, రెయిన్బో హాస్పిటల్ వద్ద బ్రిడ్జ్ నిర్మాణానికి అనుకూలంగా నివేదిక ఇచ్చారని తెలిపారు. అనంతరం ఆర్ అండ్ బి మెట్రో వాటర్ వర్క్స్, ట్రాఫిక్ పోలీస్, మెట్రో రైల్ శాఖలు కూడా అనుమతులు ఇచ్చాయని పేర్కొన్నారు.ఈ వాస్తవాలను ప్రజలకు తెలియకుండా చేసి, ఇప్పుడు కొత్తగా అనుమతులు వచ్చినట్లు తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఐదు సంవత్సరాలు పదవిలో ఉన్నప్పుడు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ విషయంలో ఏమీ చేయకుండా, పదవి కోల్పోయిన తర్వాత తన విశేష కృషి వల్లే ఈ బ్రిడ్జ్ వస్తోందంటూ అనుచరులతో ప్రచారం చేయించుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఆయన విమర్శించారు. అసలు విషయానికొస్తే, మెట్రో రైలు విస్తరణలో భాగంగా దీప్తి శ్రీనగర్ సమీపంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌ను తొలగించే ప్రక్రియలో భాగంగా, దానిని హైదర్ నగర్‌లో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై సీఎంసి స్థాయిలో చర్యలు జరుగుతున్నట్లు తమకు సమాచారం ఉందని శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. గతంలో ప్రజా ప్రతినిధులు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ విషయంలో చూపిననిర్లక్ష్యం కారణంగా ఇప్పటికే 16 మంది ప్రాణాలు కోల్పోయారని, చేతనైతే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నష్టపరిహారం కింద ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఆ పని చేయకుండా తప్పుడు ప్రచారాలు చేసుకోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఇక పేరు, ప్రచారం విషయానికొస్తే, "ఎవరి పేర్లు శిలాఫలకంపై ఉన్నా మాకు అభ్యంతరం లేదు. హైదర్ నగర్ ప్రజలకు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ కావాలి, ప్రజల ప్రాణాలు కాపాడాలి. ఇకనైనా పనులు ఆగకుండా పూర్తి చేయండి" అని సిందం శ్రీకాంత్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

## సురవరం జీవితం ప్రజాసేవకే అంకితం



**భద్రాచలం: విశాల భారతి;** భారత సిపిఐ కమ్యూనిస్టు పార్టీ డివిజన్ కార్యాలయంలో మాజీ భారత దేశ సిపిఐ ప్రధాన కార్యదర్శి రెండుసార్లు నల్లగొండ ఎంపీగా గెలిచినటువంటి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మొదటి వర్ధంతి సభ భద్రాచలం సిపిఐ డివిజన్ కార్యాలయంలో పట్టణ సమితి ఆధ్వర్యంలో సురవరం ఫోటోకు పూలదండ వేసి సీనియర్ నాయకులు భాస్కర్ రావు నివాళులు అర్పించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ భద్రాచలం టౌన్ కన్వీనర్ ఆర్ రెడ్డి శివాజీ మాట్లాడుతూ భారతదేశంలో పేద ప్రజల కార్మికుల కోసం పార్లమెంటులో తనదైన శైలిలో మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించినటువంటి వ్యక్తి అని అన్నారు. విద్యార్థి దశలో తెలంగాణ కోసం అనేక పోరాటాలు నిర్వహించి ఉత్తమ పార్లమెంటరీ మెంబర్గా అనేక అవార్డులు తీసుకున్న వ్యక్తి అని అన్నారు అదేవిధంగా భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ పరిధిలో కోసం తనదైన శైలిలో పోరాటాలు నిర్వహించాలని అన్నారు ఆయన లేని లోటు భారతదేశ ప్రజలకు చాలా బాధాకరమని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు నాయుడు సాధన పల్లి సతీష్ కొక్కిరేణి అశోక్ కుమార్ చిట్టిపోతుల కృష్ణయ్య కుమారి శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పేద, బడుగు, బలహీన వర్గాల పక్షపాతి సురవరం సుధాకర్ రెడ్డి

**సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పాల్వంచలో ఘనంగా సురవరం ప్రథమ వర్ధంతి**



**పాల్వంచ విశాల భారతి:** పేద, బడుగు, బలహీన వర్గాల పక్షపాతి సురవరం సుధాకర్ రెడ్డి అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా వీసంశెట్టి పూర్ణచంద్రరావు అన్నారు. సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ అమరజీవి సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ లో ఘనంగా నిర్వహించారు. తొలుత సురవరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో పేదలు, కార్మికులు, రైతులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడు అని, విద్యుత్ చార్జీలు పెంపు, రైతు సంక్షోభం, కార్మిక హక్కులు, వ్యక్తుల ఆర్థిక, సామాజిక హక్కుల రక్షణకు ఆయన నిత్యం పోరాటం సాగించారునీ. ప్రధానంగా 21 ఏళ్లకు ఓటు హక్కు ఆనాడు దేశంలో ఉంటే రెండు దశాబ్దాల పాటు 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పించాలని జరిగిన ఉద్యమంలో కీలకంగా నిలిచి యువజన రాజకీయ హక్కులకు కలగజేసారని తెలిపారు. ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధ్యక్ష, ప్రధానకార్యదర్శిగా, అనంతరం కాలంలో ఎస్ఎఫ్, వైఎఫ్ జాతీయ అధ్యక్ష, ప్రధానకార్యదర్శిగా ఢిల్లీలో ఉంటూ దేశవ్యాప్త విద్యార్థి, యువజన ఉద్యమాల వ్యాప్తికి విశేష కృషి చేశారునీ, ఆయన నేతృత్వంలో పనిచేసిన ఆనేక మంది విద్యార్థి, యువజన నాయకులు తరువాత కాలంలో వివిధ రాష్ట్రాల్లో రాజకీయ నాయకులుగా ఎదిగారన్నారు. సురవరం చక్కని వాగ్దాటి, విషయ స్పష్టత కలిగిన వక్త అని కొనియాడారు. ఒకతరం విద్యార్థి, యువజనులకు ఆయనో ఆకర్షణ. గుర్తింపు పొందిన పార్లమెంటేరియన్ గా కీర్తి గడించారన్నారు. సురవరం ఉద్యమస్ఫూర్తిని కొనసాగిస్తూ నిత్యం ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్మించాలని పార్టీ శ్రేణులును కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వీ పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, శనగారపు శ్రీనివాసరావు, డి చెన్నయ్య, బిక్కులాల్, నామ పండు, వెంకటేశ్వర్లు, కిరణ్, రమేష్, ప్రసాద్, వీరు, సత్యనారాయణ, లాల్ పాషా, రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బైరాగిగూడ, గండంగూడలో రహదారి భద్రత, పౌర సమస్యలపై నివాసితుల ఆందోళన

**తక్షణమే సమస్యలను పరిష్కరించాలని అధికారులకు డిమాండ్**



**హైదరాబాద్, ఆగస్టు 22 (విశాలభారతి):** బైరాగిగూడ, గండంగూడతో పాటు పరిసర కాలనీలకు చెందిన సుమారు 50 మంది నివాసితులు శనివారం సమావేశమై తమ ప్రాంతంలో నెలకొన్న రహదారి భద్రత, మౌలిక వసతులు, పౌర సమస్యలపై చర్చించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తూ మృతి చెందిన మాజీ సైనిక అధికారికి నివాసితులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి విషాదకర ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా రహదారి భద్రతను మెరుగుపరచాలని, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ప్రధాన రహదారులపై శుభ్రత, చెత్త తొలగింపు, అక్రమ ఆక్రమణల తొలగింపు, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సరఫరా, దోమల నివారణ, వీధి కుక్కల నియంత్రణ తదితర సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలు వ్యక్తిగత సమస్యలు కాదని, వేలాది మంది ప్రజల భద్రత, ఆరోగ్యం, జీవన ప్రమాణాలను ప్రభావితం చేస్తున్న సామూహిక సమస్యలని నివాసితులు పేర్కొన్నారు. ఇప్పటికే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వాటిపై కాలపరిమితితో కూడిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ ఫాలోఅప్ చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. బైరాగిగూడ, గండంగూడ, పరిసర కాలనీల ప్రెసిడెంట్లు, ప్రతినిధులు సమావేశంలో పాల్గొని స్థానిక సమస్యలపై తమ గళాన్ని వినిపించారు. ఈ కార్యక్రమాన్ని రమేష్ మంద ముందుండి నడిపించారు. పౌర సమస్యల పరిష్కారం కోసం కాలనీ ప్రతినిధులంతా సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు. కార్యక్రమానికి మద్దతుగా నిలిచిన ఏసీఎఫ్ వినయ్ రెడ్డి, నరేందర్ బాబు, బృందానికి నివాసితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేయడమే

# ప్రజా ప్రభుత్వ సంకల్పం

**నిజామాబాద్ జిల్లా విశాల భారతి**

నిజామాబాద్, ఆగస్టు 22 : పేదల సొంతింటి కలను సాకారం చేసి, వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే ప్రజా ప్రభుత్వం సంకల్పమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. నిజామాబాద్ నగరంలో శనివారం మంత్రి పలు ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. నాగారంలోని నిర్మితి కేంద్రంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారుల కోసం నిర్మించనున్న హౌసింగ్ టవర్స్ స్థలాన్ని పరిశీలించారు. రెండు ఎకరాల విస్తీర్ణంలో ఆరు అంతస్తులతో కూడిన టవర్స్ నిర్మించనున్న నేపథ్యంలో తగిన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. అనంతరం 43వ డివిజన్ లోని పాముల బస్తీలో ఇందిరమ్మ పథకం కింద ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులతో మంత్రి పొంగులేటి భేటీ అయ్యారు. ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, సకాలంలో బిల్లులు వచ్చాయా? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తమ సొంత ఇంటి కలను సాకారం చేసిందని లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా తమ కృతజ్ఞతలు తెలియజేయాలని మంత్రిని కోరారు. లబ్ధిదారులను కలిసి వారి సంతోషంలో పాలు పంచుకోవడం తనకు కూడా ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా మంత్రి హర్షం వెలిబుచ్చారు. లబ్ధిదారులకు గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన వస్త్రాలు బహూకరించారు. చివరి దశ నిర్మాణంలో ఉన్న ఇళ్లను సైతం సందర్శించి, త్వరగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అక్కడి నుండి ఐ.డీ.ఓ.సీని ఆనుకుని నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ళను మంత్రి పొంగులేటి పరిశీలించారు. తక్షణమే పెండింగ్ పనులను పూర్తి చేయాలని కంట్రాక్టర్ ను ఆదేశించారు. నిధుల కొరత ఎంతమాత్రం లేదని, పనులు పూర్తి చేసిన 24 గంటల వ్యవధిలో బిల్లులు మంజూరు చేస్తామని అన్నారు. గుత్తేదారుతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించి, డబుల్ బెడ్ రూమ్ భవన సముదాయాన్ని స్వాధీనపర్చుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, సానిటేషన్ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలన్నారు.



**లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ**

స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ కేటాయింపు పత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్య నారాయణ గుప్తా, డాక్టర్ భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, గృహ నిర్మాణ సంస్థ ఎం.డీ గౌతమ్, కలెక్టర్ భవేష్ మిశ్రా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు తదితరులు ఈ సంరంభంలో భాగస్వాములు అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా, పట్టణం, గ్రామం, గూడెం, తండా అనే తేడా లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మొదటి విడతలో రాష్ట్రంలో 4.50 లక్షల ఇళ్ళను మంజూరు చేశామని, రెండవ విడతలో 2.5 లక్షల ఇళ్ళను, హైదరాబాద్ లో లక్ష ఇళ్ళను కలుపుకుని ఇప్పటివరకు మొత్తం 8 లక్షల ఇళ్ళను తమ ప్రభుత్వం పేదలకు అందిస్తోందని మంత్రి అన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేసేంత వరకు విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో కమీషన్ లకు ఆశపడి కాళేశ్వరం కట్టారు కానీ, పదేళ్ల కాలంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని మంత్రి పొంగులేటి ఆక్షేపించారు. గత ప్రభుత్వం ఒకవేళ ఏడాదికి రెండు లక్షల చొప్పున ఇండ్లు ఇచ్చి ఉంటే, నేడు తెలంగాణ రాష్ట్రంలో పేదలందరికీ సొంత ఇండ్లు సమకూరేవని అన్నారు. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిపోయిన, మొండి గోడలకే పరిమితమైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను సైతం పూర్తి చేసి, లబ్ధిదారులకు కేటాయించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ నగరంలో ప్రస్తుతం 400 మంది లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇళ్ళను పంపిణీ చేస్తున్నామని, వారం పది రోజుల్లో మరో 300 మందికి అందజేస్తామని అన్నారు. ఇళ్ళ కేటాయింపులు పూర్తి పారదర్శకంగా జరిగేలా, అర్హులైన వారికే దక్కేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. పట్టణాలు, నగరాలలో ఇళ్ళ స్థలాలు లేని నిరుపేదల కోసం హైదరాబాద్ తరహాలోనే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగానే నిజామాబాద్ నగరంలో హౌసింగ్ బోర్డుకు చెందిన నాగారం నిర్మితి కేంద్రం వద్ద ప్రయోగాత్మకంగా ఇందిరమ్మ టవర్స్ నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించామన్నారు. గత ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో 8.20లక్షల కోట్ల రూపాయల అప్పుల భారంలో రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ, ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలను వర్తింపజేయడమే సంకల్పంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రూపాయి ఖర్చు లేకుండా పేదలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని అన్నారు. పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన పేదలకే ఇళ్లు కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. మహిళల అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, వారి పేరిటే ఇందిరమ్మ ఇండ్లు, ఇతర సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామని గుర్తు చేశారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించాలని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యా బోధన జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రాధాన్యతా క్రమంలో అమలు చేస్తున్నామని, ఇందులో భాగంగానే ఏడాది కాలంలోనే మొదటి విడత కింద 4.50లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని వివరించారు. ఓ వైపు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, మరోవైపు సమాంతరంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. అయినప్పటికీ, ప్రతిపక్షాలు పసలేని ఆరోపణలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రజలు వాస్తవాలను గమనించాలని, సంక్షేమాభివృద్ధికి పాటుపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలవాలని ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ కోరారు. ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ భూపతి రెడ్డిలు మాట్లాడుతూ, డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ పట్ల హర్షం వెలిబుచ్చారు. మంత్రి వెంట సీ.పీ సాయి చైతన్య, డీ.ఆర్.ఓ గీత, ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

## నిజామాబాద్ రూరల్‌లో రెవెన్యూ కార్యాలయాలకు శంకుస్థాపన



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి**

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక అడుగు పడింది. నియోజకవర్గంలోని ఇందల్వాయి, మోపాల్, నిజామాబాద్ రూరల్ మండలాలకు మంజూరైన నూతన తహసీల్దార్ కార్యాలయాల భవనాలతో పాటు నిజామాబాద్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణాలకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డితో కలిసి శనివారం గూపన్‌పల్లిలో శంకుస్థాపన చేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాలుగు కార్యాలయాల భవన నిర్మాణాలకు సామూహికంగా శంకుస్థాపన నిర్వహించారు. మూడు తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలకు ఒక్కో కార్యాలయానికి రూ.2.25 కోట్ల చొప్పున నిధులు కేటాయించగా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.75 కోట్ల నిధులతో పనులు చేపట్టనున్నారు. ప్రజలకు మెరుగైన, సమర్థవంతమైన రెవెన్యూ సేవలు అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో కార్యాలయ భవనాలను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. నూతన కార్యాలయాల నిర్మాణంతో ప్రజలు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, పరిపాలనా సేవలను ప్రజలకు చేరువ చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో నియోజకవర్గానికి అభివృద్ధి పనులు మంజూరు చేయించుకుంటూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ప్రజా అవసరాలను ప్రస్తుత ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి అవసరమైన నిధులు, అభివృద్ధి కార్యక్రమాలను తీసుకురావడంలో ఎమ్మెల్యే భూపతి రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, నగర మేయర్ ఉమారాణి , వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, శేఖర్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నగర మేయర్ ఉమారాణి, ఆయా శాఖల ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తోడు నీడ లేదు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోండి

**భద్రాచలం : విశాల భారతి;** భద్రాచలం పట్టణంలోని రాజుపేట కాలనీలో కొల్లు నిర్మల అనే ఓ నిరుపేద మహిళ ఇళ్లల్లో పనులు చేసుకుంటూ ఇద్దరు ఆడపిల్లలను పోషించుకుంటూ అద్దె ఇంట్లో పోషణ జీవనం కొనసాగిస్తా ఉంది. ఈ మహిళకు భర్త చనిపోవడం వలన ఒంటరిగా బతుకు ప్రయాణం సాగిస్తూ అద్దె ఇంట్లో చాలీ చాలని జీవితాన్ని అనుభవిస్తా ఉంది. అద్దెలు కట్టలేక ఎవరికీ చెప్పుకోలేక ఆమె జీవితం కటిక దరిద్రం మధ్యన కొట్టుమిట్టాడుతోంది. ఇద్దరు ఆడపిల్లలతో బతుకు ప్రయాణం సాగిస్తుంది. ఇళ్లల్లో పనిచేస్తేనే కోట గడవని నేపథ్యం కనిపిస్తుంది. ఇటువంటి నిరుపేద బతుకులకు ప్రభుత్వం ఆసరాగా నిలవాలి ఉంటానికి జాను జాగలేక తింటానికి సరైన తిండి లేక కట్టుకోను బట్టలు లేక సరైన జీవితాన్ని అనుభవించలేక ఆమె ఘోష వర్ణాతితంగా మారింది. ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు డబల్ బెడ్ రూమ్ లు ఇటువంటి దిక్కులేని మహిళా కుటుంబానికి ఇస్తే కొంత ఊరట లభిస్తుంది. ప్రభుత్వాధికారులు ఈమె బాధను గాధను అర్థం చేసుకొని ఆమెకి చేదోడు వాదోడుగా ఉండాలని ఆమె వేడుకుంటుంది. పట్టెడన్నం తింటానికి నరకయాతన పడుతున్న ఆ కుటుంబానికి అధికారులు దిక్కు అవ్వాలి ఆడపిల్లలను తలదాచుకునేందుకు డబల్ బెడ్ రూమ్ ఏర్పాటు చేసి ప్రభుత్వమే వారికి చేదోడు వాదోడుగా నిలవాలి. నిరుపేద రాలైన ఆ మహిళ కన్నీటి కష్టాలను ప్రభుత్వం ఆదుకోవాలి. అన్ని విధాల ఆమెకు ధైర్యాన్ని బలాన్ని అందించాలి స్థానిక ఎమ్మెల్యే స్పందించి రాజుపేట కాలనీ లో నివాసం ఉంటున్న నిర్మలకు డబల్ బెడ్ రూమ్ ఏర్పాటు చేసి ఆమెను వారి పిల్లలను కష్టాల కడలి నుంచి బయట పడేలా అని చర్యలు చేపట్టాలని ఆమె కుటుంబాన్ని తోడుగా నిలవాలని ఆమె వేడుకుంటుంది.





## బాల్ బ్యాట్మెంటన్ క్రీడాకారుల ఎంపిక

**విశాల భారతి, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని విజయ్ హై స్కూల్ క్రీడా మైదానంలో శనివారం రోజు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు గడ్డం శ్రావణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోనగిరి శ్యామ్ ఆధ్వర్యంలో జిల్లా బాల్ బ్యాట్మెంటన్ బాల, బాలికల క్రీడాకారుల క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి జిల్లాల నుండి 130 క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ ఎంపికలకు ముఖ్యఅతిథిగా జిల్లా బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం శ్రావణ్ రెడ్డి, విశిష్ట అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ కవిత దివాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి, విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 28వ తేదీ నుండి 30 వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా బిహెచ్ఈఎల్ శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాల గ్రౌండ్స్ లో జరిగే 45వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర, బాలికల బాల్ బ్యాట్మెంటన్ క్రీడా పోటీలకు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారనీ టోర్నమెంట్లో ప్రతిభ కనబరిచ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు తెలిపారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, మాట్లాడుతూ బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా జిల్లా సంఘం కృషి చేస్తుందని రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పథకాలు సాధిస్తుందని, ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించి తుది జట్టును ఎంపిక చేయడం జరుగుతుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సునీత, కామారెడ్డి కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి రాజేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేష్, సంఘ సభ్యులు సురేష్, సీనియర్ క్రీడాకారులు ఆనంద్, కార్తీక్, సాయికుమార్, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్యామల, మహేష్, యు మహేష్, శివ మహేష్, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్లు అప్పగింత



**విశాల భారతి, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో పోయినటువంటి మొబైల్ ఫోన్లను సిఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులు ఐదు మందికి 01.ఉమ్మేడ లక్ష్మి, 02.నాగుల నిరంజన్, 03.కాందు తుకారం సేలి, 04.పిట్ల నరేష్, 05.ఆలకుంట సుజాత, లకు మొబైల్ ఫోన్ లను అప్పగించబడినదని స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇందులో భాగంగా మూడు సంవత్సర క్రితం రెండు మొబైల్స్, ఒక సంవత్సరం లోపు మూడు మొబైల్స్ లు ఇచ్చినట్లు తెలిపారు.

## మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు

**విశాల భారతి,పరకాల:** మెగాస్టార్ చిరంజీవి 71వ పుట్టినరోజు వేడుకలను పరకాల పట్టణంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలిలో చిరంజీవి అభిమాని బొచ్చు భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మడికొండ శ్రీను మాట్లాడుతూ.. చిరంజీవి తన నటనతో యువతతో పాటు కోట్లాది మంది ప్రేక్షకులకు అభిమాన నటుడిగా నిలిచారని అన్నారు. సమాజ సేవలో భాగంగా అనేక సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ఎంతోమందికి ప్రాణదానం చేస్తున్నారని కొనియాడారు. చిరంజీవి మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బొచ్చు భాస్కర్, బొచ్చు రవికుమార్, బొచ్చు జాన్సన్, బొచ్చు మహేష్, ఒడ్డెపెల్లి ప్రభు, ధర్మారం తిరుపతి, కందుకూరి వెంకట్, దొమ్మటి శ్రీను, ఒంటెరు నాగరాజు, బొచ్చు దేవయ్య, అరికిళ్ల దశరతం, మేకల దిలీప్, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.



# చిన్న స్థలాల్లో భారీ నిర్మాణాలు..
# చర్యలు ఎక్కడ?

- అంజయ్యనగర్ ఘటనతో టౌన్ ప్లానింగ్‌పై ఆరోపణలు
- శేరిలింగంపల్లి జోన్‌లో పర్యవేక్షణపై ప్రశ్నల వర్షం

సైబరాబాద్ - విశాల భారతి

అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం కుప్పకూలి ఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటనతో శేరిలింగంపల్లి జోన్‌లో టౌన్ ప్లానింగ్ వ్యవహారాలపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. సుమారు 50 గజాల స్థలంలో, అదీ నాలా పక్కనే భారీ నిర్మాణం చేపట్టడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంత చిన్న స్థలంలో ఇలాంటి నిర్మాణానికి అనుమతులు ఎలా వచ్చాయి? అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారా? నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఎందుకు తీసుకోలేదనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఉమేశ్ కారే (34), మోపత్ (42), అనే ఇద్దరు టైల్స్ కార్మికులు మృతి చెందారు. నిర్మాణం పూర్తయ్యే దశలో ఉన్న భవనం మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా కుప్పకూలింది. శిథిలాలు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై పడటంతో ఇద్దరు వృద్ధులు గాయపడ్డారు. ప్రమాదం సాయంత్రం సమయంలో జరిగి ఉంటే ప్రాణనష్టం మరింత ఎక్కువగా ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**50 గజాల్లో ఏడంతస్తుల నిర్మాణమా..?**

చిన్న స్థలాల్లో నిర్మాణాలకు కూడా స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. 75 చదరపు గజాల వరకు ఉన్న నివాస స్థలాలకు నిర్దిష్ట నిబంధనల కింద పరిమిత నిర్మాణాలకు మాత్రమే అవకాశం ఉంటుంది. 50 గజాల స్థలంలో నేరుగా ఏడంతస్తుల భవనం నిర్మించడం సాధారణ చిన్నస్థల నిర్మాణ అనుమతి పరిధిలోకి రాదని నిపుణులు చెబుతున్నారు. భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చే సమయంలో స్థల విస్తీర్ణంతోపాటు రహదారి వెడల్పు, వదలాల్సిన ఖాళీ స్థలం, జోనింగ్, పార్కింగ్, భవనం ఎత్తు, నిర్మాణ పటిష్టత తదితర అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. భవనం ఎత్తు 18 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువగా ఉంటే ఎత్తైన భవనాలకు సంబంధించిన అదనపు భద్రతా నిబంధనలు వర్తిస్తాయి. అగ్నిమాపక భద్రత, నిర్మాణ పటిష్టత, నాలా పరిధికి సంబంధించిన నిబంధనలు తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. మరి అంజయ్యనగర్‌లో కూలిపోయిన భవనానికి అనుమతులు ఏ ప్రాతిపదికన మంజూరయ్యాయి? నిర్మాణ సమయంలో అధికారులు ఎన్నిసార్లు తనిఖీలు చేశారు? నాలా పక్కన నిర్మాణానికి సంబంధించిన నిబంధనలు పాటించారా? నిర్మాణ పటిష్టతను ఎవరు పరిశీలించారు? అన్నది ఇప్పుడు తేలాల్సి ఉంది.

**48, 49 సర్కిళ్లలో తీవ్ర ఆరోపణలు..**

ఇదిలా ఉండగా శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని 48, 49 సర్కిళ్ల టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై కొంతకాలంగా తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణ అనుమతులు, నిబంధనల ఉల్లంఘనలు, అక్రమ నిర్మాణాల విషయంలో కొందరు అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారంటూ ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నట్లు ప్రజాసంఘాలు పేర్కొంటున్నాయి. ధనార్జనే ధ్యేయంగా కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులకు, ప్రజావాణిలో నేరుగా, ఫిర్యాదు వేదికల్లో, వివిధ మాధ్యమాల ద్వారా పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించలేదని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. తమ ఫిర్యాదులు బుట్టదాఖలవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఐఏఎస్ స్థాయి అధికారులు విధుల్లో ఉన్నా మార్పేదీ..?**

శేరిలింగంపల్లి జోన్‌లో గతంలో దాసరి హరిచందన, రోనాల్డ్ రాస్ వంటి ఐఏఎస్ స్థాయి అధికారులు పనిచేశారు. ప్రస్తుతం సీఎంసీ కమిషనర్ శ్రీజన, జోనల్ స్థాయి కమిషనర్‌గా నారాయణ్ అమిత్ వంటి ఐఏఎస్ అధికారులు బాధ్యతలు నిర్వహించినప్పటికీ టౌన్ ప్లానింగ్ విభాగంపై వస్తున్న అవినీతి ఆరోపణలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడలేదని సామాన్యులు, ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. ఉన్నతస్థాయి అధికారులు మారుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితిలో చెప్పుకోదగ్గ మార్పు కనిపించడం లేదని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులు వస్తున్నప్పటికీ బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

**ఎమ్మెల్యే తీరుపైనా ప్రతిపక్షాల విమర్శలు..!**

తాజా ఘటన నేపథ్యంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తీరుపైనా ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రశ్నిస్తున్నాయి. ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోకుండా అలసత్వం ఎందుకు ప్రదర్శిస్తున్నారని నిలదీస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు, ఆరోపణలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ వ్యవహారంలో రాజకీయ జోక్యం ఉందా? ఎవరిని కాపాడేందుకు చర్యలను నిలిపివేస్తున్నారనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి. అంతేకాకుండా అక్రమ నిర్మాణాల వ్యవహారంలో ఎమ్మెల్యేకు కూడా వాటాలు వెళుతున్నాయనే స్థాయిలో ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతోపాటు సంబంధిత అధికారులు ఈ ఆరోపణలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**తనిఖీలు.. సోదాలు.. ఆపై మౌనం**

టౌన్ ప్లానింగ్ వ్యవహారాలపై విజిలెన్స్ అధికారులు గతంలో పలుమార్లు తనిఖీలు, సోదాలు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. అయితే తనిఖీల సమయంలో హడావుడి కనిపించినా ఆ తర్వాత తీసుకున్న చర్యలపై స్పష్టత లేకపోవడం అనుమానాలకు తావిస్తోందని వారు అంటున్నారు. కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతస్థాయి వరకు బాధ్యతను నిర్ధారించే వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అధికారులు మారుతున్నా అక్రమ నిర్మాణాలు, నిబంధనల ఉల్లంఘనలు కొనసాగుతుండటంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నాయి.




ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సిఎంసి కమిషనర్ శ్రీ జన



భవనం కూలి శిథిలాలు పడడంతో పాక్షికంగా దెబ్బతిన్న మరో భవనం

## ప్రాణాలు పోయాకే మేల్కొంటారా..?

అంజయ్యనగర్ ఘటనతో చిన్న స్థలాల్లో భారీ నిర్మాణాలపై తీవ్ర చర్చ జరుగుతోంది. ముఖ్యంగా 50 గజాల వంటి చిన్న స్థలాల్లో బహుళ అంతస్తుల భవనాలు, నాలాలు లేదా వరద ప్రవాహ మార్గాల సమీపంలోని నిర్మాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి శేరిలింగంపల్లి జోన్‌లో అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని, నిర్మాణ అనుమతులపై సమగ్ర పరిశీలన నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంపై వస్తున్న అవినీతి ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనలు లేదా అక్రమ నిర్మాణాల కారణంగా భవిష్యత్తులో మరో ప్రాణనష్టం జరగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలాల్లో మృతిచెంది కూరుకుపోయిన మృతదేహాలను వెలికి తీసిన హైడ్రా సిబ్బంది

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా సురవరం సుధాకర్‌రెడ్డి




- పేదల పక్షాన నిలిచిన ఆదర్శ కమ్యూనిస్టు నేత
- ఆయన ఆశయాల సాధనకు ఉద్యమాలే నిజమైన నివాళి

అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :

ప్రజా సమస్యలే తన ఊపిరిగా, పేదల హక్కుల పరిరక్షణే తన జీవిత ధ్యేయంగా ముందుకు సాగిన ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ప్రస్థానంలో సురవరం సుధాకర్‌రెడ్డి జీవితం ప్రతి కమ్యూనిస్టు కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని అన్నారు. రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్ 3 భూపోరాట కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోజు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**పార్లమెంట్‌లో ఉన్నా.. పేదల గుడిసెల కోసం స్పందించిన నేత**

నాయకులు మాట్లాడుతూ.. సురవరం సుధాకర్‌రెడ్డి పదవులను ప్రజాసేవకు సాధనంగా ఉపయోగించుకున్నారని తెలిపారు. పేదల గుడిసెలను తొలగించేందుకు అప్పటి పాలకులు ప్రయత్నించిన సమయంలో పార్లమెంట్ లో ఉన్నప్పటికీ ప్రజల సమస్యపై స్పందించి, గుడిసెలను కాపాడేందుకు కృషి చేసిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. మతోన్మాద రాజకీయాలను సురవరం సుధాకర్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారని, ఆయన సిద్ధాంతాలను వ్యతిరేకించే రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సైతం ఆయన నిబద్ధత, నిజాయితీ, ప్రజాసేవను గౌరవించేవారని పేర్కొన్నారు.

**రావి నారాయణరెడ్డి కాలనీ పేదలకు అండగా సీపీఐ**

రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్ 1, ఫేజ్ 2 ప్రాంతాల్లో అభివృద్ధి కొనసాగుతోందని నాయకులు తెలిపారు. ఫేజ్ 3లో గుడిసెలు వేసుకున్న ప్రతి కుటుంబానికి న్యాయం జరిగే వరకు సీపీఐ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. పేదల హక్కుల కోసం పోరాడటమే కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని అన్నారు. దేశంలో ఇల్లు, బట్ట, తిండి వంటి కనీస అవసరాలకు నోచుకోని నిరుపేదల తరఫున సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తోందని తెలిపారు. 'బద్లావ్ జరూరీ హై.. మార్పు కావాలి' నినాదంతో ఈ నెల 17 నుంచి 21 వరకు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రచార, పోరాట కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని, సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

**రాజ్యాంగ పరిరక్షణకు ఐక్య పోరాటం**

దేశంలో మతోన్మాదం పెరుగుతున్న నేపథ్యంలో భారత రాజ్యాంగాన్ని కాపాడేందుకు, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు. సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, సామిడి శేఖర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు ఏశాలి నరసింహ, కాటి అరుణ, తైలి మధు, పొన్నాల యాదగిరి, పట్టి నవనీత, పేరాల గోపి, డౌల రాములు, ఆవుల యాదగిరి, సుజాత, అలివేల, గణేష్, అడిమయ్య, పాండు, బాల్‌రెడ్డి, అశోక్, సంధ్య, కావేరి, నీలా, శ్రీధర్‌రెడ్డితో పాటు ప్రజా సంఘాల నాయకులు, సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతన్నలకు మద్దతు పలికిన ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్

**విశాలభారతి, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోన శనివారం రోజు రైతన్నలు చేపట్టిన ఆందోళనకు ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ మద్దతు తెలిపారు. యూరియా యాప్ వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆర్మూర్ ప్రాంత రైతాంగం చైతన్యవంతులని ఆయన చెప్పుకొచ్చారు. యూరియా లేకపోతే పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. అన్నదాతలకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎకరానికి మూడు యూరియా సంచులు ఇవ్వాలని ప్రభుత్వాలను, నాయకులను కోరారు. అన్నదాతల పట్ల నిర్లక్ష్యం సరికాదన్నారు. యూరియా విషయంలో ప్రభుత్వాలు, పాలకుల నిర్లక్ష్యాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ఇకనైనా రైతన్నల ఆవేదనను ప్రభుత్వాలు అర్థం చేసుకొని సరిపడా యూరియా అందించాలన్నారు. రైతులు పండించే పంటలను కాపాడాలన్నారు. రైతులకు 100 శాతం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# అనుమతుల్లేవు.. డీజేపై ఉక్కుపాదం!

**ఎల్ బి నగర్ విశాల భారతి :** నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే అత్యంత రద్దీ ప్రాంతమైన వనస్థలిపురం పనామా ఎక్స్‌రోడ్‌లో అనుమతులు లేకుండా భారీ డీజే సౌండ్ నిర్వహించారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. శనివారం వారాహి సిల్క్స్ అండ్ సిల్వర్ జువెలరీ షాప్ ప్రారంభోత్సవం సందర్భంగా భారీ శబ్దాలతో డీజే నిర్వహించడంతో పాటు, రహదారులకు అడ్డంగా ప్రచార బోర్డులు, కార్యక్రమ ఏర్పాట్లు చేశారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాణిజ్య కార్యక్రమం పేరుతో ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించడం, బస్‌స్టాప్ వద్ద ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రముఖ సినీ తారల చేతుల మీదుగా షాప్ ప్రారంభోత్సవం జరగడంతో భారీగా జనసమూహం తరలివచ్చింది. ఈ నేపథ్యంలో నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయడంతో పనామా ఎక్స్‌రోడ్‌లో ట్రాఫిక్ రద్దీ మరింత పెరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. ప్రధానంగా అంబులెన్సు దారి ఇవ్వకుండా, ప్రజలు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు, పాదాచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారని ఆరోపిస్తున్నారు. అధిక డెసిబెల్స్‌తో మారుమోగిన డీజే సౌండ్ కారణంగా సాధారణ ప్రజలు ఒకింత భయాందోళనకు గురైనట్లు కూడా సమాచారం.

**బస్‌స్టాప్ వద్దే హడావుడి.. ప్రయాణికుల ఇక్కట్లు!**

పనామా ఎక్స్‌రోడ్ వద్ద ఉన్న బస్‌స్టాప్ ప్రాంతంలోనే కార్యక్రమానికి సంబంధించిన హడావుడి కొనసాగడంతో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని స్థానికులు వాపోయారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు రద్దీ మధ్య నిలబడాల్సి రావడం, పాదాచారులు రహదారిని దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందని తెలిపారు. బస్సులు ఆగాల్సిన ప్రదేశంలో వాణిజ్య కార్యక్రమాల హడావుడి నెలకొంటే ప్రజల భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా, రహదారులకు అడ్డంగా బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారుల దృష్టి మరలడంతో పాటు ట్రాఫిక్‌కు ఆటంకం ఏర్పడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అత్యంత రద్దీగా ఉండే పనామా ఎక్స్‌రోడ్‌లో ఇలాంటి ఏర్పాట్లకు అనుమతులు లేకపోతే అధికారులు ముందుగానే ఎందుకు స్పందించలేదన్న ప్రశ్నలు కూడా స్థానికుల నుంచి వస్తున్నాయి.

**అనుమతుల్లేవు.. పోలీసుల స్పష్టీకరణ**

ఈ ఘటనపై ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో విషయం వనస్థలిపురం పోలీసుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. ప్రజాప్రయోజనాల దృష్ట్యా స్థానికులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి, అనుమతులు లేకుండా డీజే నిర్వహిస్తున్నారంటూ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు డీజే సౌండ్ నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఎస్ఐ రవి, ఇన్స్పెక్టర్ రవిబాబు ఫిర్యాదుదారులతో మాట్లాడి పరిస్థితిపై స్పందించినట్లు సమాచారం. సంబంధిత అనుమతులు లేకుండా భారీ శబ్దాలతో డీజే నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, అవసరమైతే కేసులు కూడా నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించినట్లు తెలిసింది.

**సీఐ హెచ్చరిక.. ఇకపై ఉపేక్షించేది లేదు!**

వారాహి సిల్క్స్ అండ్ సిల్వర్ జువెలరీ షాప్ వద్ద భవిష్యత్తులో అనుమతులు లేకుండా డీజే సౌండ్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రవిబాబు హామీ ఇచ్చినట్లు సమాచారం. ప్రజలకు, వాహనదారులకు, పాదాచారులకు ఇబ్బందులు కలిగించేలా ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించబోమని పోలీసులు స్పష్టం చేసినట్లు తెలిసింది. వాణిజ్య సంస్థలు తమ ప్రచారం, ప్రారంభోత్సవాలు చేసుకోవడం తప్పుకాదని, అయితే ప్రజల భద్రతను, ట్రాఫిక్ నిబంధనలను, శబ్ద కాలుష్య నియంత్రణను పక్కనపెట్టి ఇష్టానుసారంగా వ్యవహరించడం మాత్రం సహించరాదని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా బస్‌స్టాప్‌లు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. "వ్యాపారం కోసం ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు.. ప్రచారం పేరుతో రహదారులను ఆక్రమించొద్దు.. అనుమతులు లేకుండా డీజే మోతతో ప్రజల ప్రశాంతతను భంగం చేయొద్దు" అంటూ స్థానికులు ఘాటుగా హెచ్చరిస్తున్నారు. ఇకనైనా అధికారులు రద్దీ ప్రాంతాల్లో నిబంధనల ఉల్లంఘనపై ప్రత్యేక నిఘా పెట్టి, అనుమతుల్లేని డీజేలు, అక్రమ బోర్డులు, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే ఏర్పాట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ అధికారులు పోలీసులను ప్రజలు కోరుతున్నారు.




# డ్రగ్స్ రహిత సమాజం కోసం గూడూరులో గర్జించిన యువత

- 1,000 మందికి పైగా విద్యార్థులతో గూడూరులో ఘనంగా 2కే రన్
- జెండా ఊపి ప్రారంభించిన జిల్లా ఎస్పీ డా. శబరీష్
- మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం
- సమాచారం ఇస్తే రూ.5 వేల వరకు నగదు బహుమతి

మహబూబాబాద్ జిల్లా గూడూర్ విశాల భారతి):

మాదకద్రవ్యాల మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టి యువత భవిష్యత్తును కాపాడడమే లక్ష్యంగా మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గూడూరు మండల కేంద్రంలో నిర్వహించిన 'మన ఊరు-మన బాధ్యత' 2కే రన్ - ఫర్ డ్రగ్స్ ఫ్రీ సొసైటీ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సాగిన ఈ భారీ అవగాహన కార్యక్రమంలో పాఠశాలలు, కళాశాలలకు చెందిన 1,000 మందికి పైగా విద్యార్థులు, యువతీ యువకులు పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ సంఘీభావాన్ని చాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి., ఐపీఎస్ జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభించారు. విద్యార్థులు, యువతతో కలిసి పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో ముందుకు సాగారు. యువతలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంచడంతో పాటు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సందేశాన్ని కార్యక్రమం ద్వారా చాటారు.

**యువతే దేశ భవిష్యత్తు.. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.**

ఈ సందర్భంగా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమైన దశ అని అన్నారు. యువత తమ విలువైన సమయాన్ని దురలవాట్లకు బలిచేయకుండా విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత లక్ష్యాల సాధన వైపు మళ్లించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడటం వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం, భవిష్యత్తు మొత్తం దెబ్బతింటుందని హెచ్చరించారు.

డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలు శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, క్షణిక ఆనందం కోసం వాటికి బానిసైతే జీవితాంతం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పిల్లల ప్రవర్తనను గమనిస్తూ వారిలో వచ్చే మార్పులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




## డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

2కే రన్ అనంతరం ఎస్పీ డా. శబరీష్ పి., ఐపీఎస్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు తమ కుటుంబాలు, స్నేహితులు, సమాజాన్ని కూడా డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు సీఐ వినయ్ కుమార్, ఎస్సై సీహెచ్ రమేష్‌బాబు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశంతో గూడూరులో నిర్వహించిన 2కే రన్ విజయవంతంగా ముగిసింది.

**డ్రగ్స్‌పై పోలీసుల ఉక్కుపాదం.**

జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపడుతోందని ఎస్పీ స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ డ్రగ్స్ అక్రమ కార్యకలాపాలపై నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గంజాయి పరీక్షా కిట్ పనితీరును విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరించారు. మాదకద్రవ్యాల వినియోగంపై అనుమానం ఉన్న సందర్భాల్లో పరీక్షల ద్వారా వాటిని గుర్తించే విధానంపై అవగాహన కల్పించారు. యువత ఇలాంటి పరిస్థితులకు దూరంగా ఉండి తమ జీవితాన్ని, భవిష్యత్తును కాపాడుకోవాలని ఎస్పీ సూచించారు.

**ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు.**

మాదకద్రవ్యాలను విక్రయించడం, సరఫరా చేయడం, రవాణా చేయడం, నిల్వ చేయడం లేదా వినియోగించడం వంటి చర్యలకు పాల్పడితే ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. డ్రగ్స్ కేసుల్లో చిక్కుకోవడం వల్ల వ్యక్తిగత జీవితంపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు, విదేశీ ప్రయాణాలకు సంబంధించిన అవకాశాలు కూడా దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు.

**మైనర్లకు పొగాకు విక్రయిస్తే చర్యలు**

మైనర్లకు సిగరెట్లు, గుట్కా, పాన్ మసాలా తదితర పొగాకు ఉత్పత్తులను విక్రయించే దుకాణదారులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. కిరాణా దుకాణాలు, పాన్ షాపుల వద్ద మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదనే హెచ్చరిక బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**సమాచారం ఇస్తే రూ.5 వేల వరకు బహుమతి.**

జిల్లాను గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారికి రూ.5,000 వరకు నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్ 87126 56999కు తెలియజేయాలని ఎస్పీ కోరారు.



# వారిద్దరూ ఉత్తరదక్షిణ ధృవాలు

వరుస సక్సెస్‌లతో దూసుకుపోతున్నది మలయాళ మందారం మమితాబైజు. ఇటీవలే 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో తెలుగు, తమిళ ప్రేక్షకులను అలరించిన ఈ అందాలభామ.. రీసెంట్‌గా 'బెత్లేహెమ్ కుటుంబ యూనిట్' చిత్రం ద్వారా మలయాళంలోనూ భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నది. ఈ రెండు విజయాలూ ఏజ్ గ్యాప్ లవ్‌స్టోరీలే కావడం విశేషం. దీనిపై మమితా మాటాడుతూ 'రెండూ ఏజ్ గ్యాప్ లవ్‌స్టోరీలే అయినా.. భావోద్వేగాల్లో చాలా తేడా ఉన్నది. 'విశ్వనాథ్ అండ్ సన్స్'లో మ్యాడీకీ, 'బెత్లేహెమ్ కుటుంబ యూనిట్'లో నేను పోషించిన ఆష్లే పాత్రకు అస్సలు సంబంధం లేదు. ఇద్దరూ ఉత్తరదక్షిణ ధృవాలు. మ్యాడీ ధృఢ సంకల్పం గల అమ్మాయి. ఆష్లేది బలహీనమైన వ్యక్తిత్వం. తనకంటే పదేళ్లు పెద్దవాడైన జస్టిన్(నివిన్ పాలీ)ని ప్రేమించి, సమాజపు మాటల వల్ల అతనికి దూరమవుతుంది. ఇలాంటి విభిన్న పాత్రలతో విజయాలు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా' అంటూ చెప్పుకొచ్చింది మమితాబైజు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.